


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 19-09-2025 | సంపుటి - 27 | సంచిక - 128 | రూ : 4 | పేజీలు: 8




2లో

## రేవంత్ రెడ్డితో బ్రిటన్ హైకమిషనర్ భేటీ

### తెలంగాణ విద్యార్థులకు యూకే స్కాలర్‌షిప్స్‌కు అంగీకారం

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భారత బ్రిటీష్ హైకమిషనర్ లిండీ కామెరాన్ భేటీ
- తెలంగాణ విద్యార్థులకు చెవెనింగ్ స్కాలర్‌షిప్స్‌కు బ్రిటన్ అంగీకారం
- రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లకు శిక్షణ ఇచ్చేందుకు సుముఖత

## మీ అభ్యంతరాలను అఫిడవిట్ రూపంలో ఇవ్వండి

### 'ఫిరాయింపు'పై ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యేలకు మరోసారి అసెంబ్లీ కార్యదర్శి లేఖలు



హైదరాబాద్: పార్టీ ఫిరాయింపు నోటీసులపై సమాధానాలిచ్చిన 8 మంది ఎమ్మెల్యేల వివరణలపై తమ అభ్యంతరాలను అఫిడవిట్ రూపంలో అందజేయాలని.. ఫిర్యాదు చేసిన సంబంధిత భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యేలకు గురువారం శాసనసభ కార్యదర్శి వి.నరసింహాచార్యులు

తరువాయి 2లో

## బతుకమ్మ, దసరాకు టీజీఎస్ఆర్టీసీ భారీ ఏర్పాట్లు

- బతుకమ్మ, దసరా పండగల కోసం 7754 ప్రత్యేక బస్సుల ఏర్పాటు
- సెప్టెంబర్ 20 నుంచి అక్టోబర్ 2 వరకు స్పెషల్ సర్వీసులు
- 377 ప్రత్యేక బస్సులకు ఆన్‌లైన్‌లో ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం
- రద్దీ ప్రాంతాల్లో ప్రయాణికుల కోసం ప్రత్యేక సౌకర్యాలు, క్యాంపులు
- నిర్ణీత తేదీల్లో స్పెషల్ బస్సుల్లో మాత్రమే ఛార్జీల సవరణ

2లో








## ఉన్నట్టుండి వస్తోంది.. కన్నీరు కురుస్తోంది

- కుండపోత వర్షాలతో హైదరాబాద్ అతలాకుతలం
- రోడ్లపైకి వరదతో స్తంభిస్తున్న ట్రాఫిక్
- నీట మునుగుతున్న పలు కాలనీలు
- వారంలో నలుగురు మృత్యువాత

2లో

## తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు భారీ భద్రతా ఏర్పాట్లు

- సెప్టెంబరు 24 నుంచి అక్టోబర్ 2 వరకు శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు
- భద్రతా విధుల్లో మొత్తం 4,000 మంది పోలీసుల మోహరింపు
- గరుడ సేవ రోజు ఘాట్ రోడ్లపై ద్విచక్ర వాహనాల రాకపోకలు బంద్



2లో

## విధుల్లో కంట్రోలర్ గాఢ నిద్ర..

### గాల్లోనే 18 నిమిషాలు చక్కర్లు కొట్టిన విమానం!

- ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ నిద్రపోవడంతో గాల్లోనే చక్కర్లు కొట్టిన విమానం
- పారిస్ నుంచి కార్సికా వస్తున్న ఎయిర్ కార్సికా ఫ్లైట్




## నేపాల్ నూతన ప్రధానికి మోదీ ఫోన్.. అండగా ఉంటామని హామీ

- నేపాల్ తాత్కాలిక ప్రధాని సుశీల కర్కితో ప్రధాని మోదీ ఫోన్ సంభాషణ
- ఇటీవల ప్రాణనష్టంపై తీవ్ర సంతాపం వ్యక్తం చేసిన మోదీ
- శాంతి స్థాపన ప్రయత్నాలకు భారత్ మద్దతు ఉంటుందని స్పష్టం
- నేపాల్ జాతీయ దినోత్సవం సందర్భంగా ముందుగానే శుభాకాంక్షలు
- సంభాషణ ఆత్మీయంగా జరిగిందని 'ఎక్స్' వేదికగా వెల్లడి



**ఢిల్లీ, సెప్టెంబర్ 18 :** కష్టకాలంలో ఉన్న పొరుగు దేశం నేపాల్‌కు భారత్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు. ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వ నూతన ప్రధానిగా నియమితులైన సుశీల కర్కితో ఆయన ఫోన్‌లో

తరువాయి 2లో

## జీఎస్టీ 2.0... ప్రజలకు ఇది పండుగ బోనస్: సీఎం చంద్రబాబు

- జీఎస్టీ 2.0 సంస్కరణలపై దేశంలోనే తొలి తీర్మానం చేసిన ఏపీ శాసనసభ
- సంస్కరణలు దేశానికి గేమ్ ఛేంజర్ అని అభివర్ణించిన సీఎం చంద్రబాబు
- ప్రజలకు ముందుగానే వచ్చిన దసరా, దీపావళి బోనస్ అని వ్యాఖ్య
- 99 శాతం వస్తువులు 5 శాతం పన్ను శ్లాబులోకి వస్తాయని వెల్లడి
- నిర్మాణ రంగం, వ్యవసాయం, ఆరోగ్య బీమా రంగాలకు భారీ ఊరట
- సంస్కరణల ప్రయోజనాలపై రాష్ట్రవ్యాప్తంగా ప్రచారానికి ప్రభుత్వం యోచన



2లో

# జీఎస్టీ 2.0... ప్రజలకు ఇది పండుగ బోనస్: సీఎం చంద్రబాబు

**అమరావతి, సెప్టెంబర్ 18** వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) విధానంలో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన నూతన సంస్కరణలను స్వాగతిస్తూ ఆంధ్రప్రదేశ్ శాసనసభ గురువారం కీలక తీర్మానం చేసింది. 'జీఎస్టీ 2.0' సంస్కరణలకు మద్దతుగా తీర్మానం చేసిన తొలి రాష్ట్రంగా ఏపీ నిలిచింది. ఈ తీర్మానంపై ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, ఈ సంస్కరణలు దేశ ఆర్థిక వ్యవస్థలో ఒక 'గేమ్ ఛేంజర్'గా నిలుస్తాయని అభివర్ణించారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం ప్రజలకు దసరా, దీపావళి పండుగలను ముందుగానే తీసుకువచ్చిందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ... గతంలో దేశంలో పన్నుల వ్యవస్థ అత్యంత సంక్లిష్టంగా ఉండేదని గుర్తుచేశారు. సీఎస్టీ, వ్యాట్ వంటి 17 రకాల పన్నులు, 13 రకాల సెస్సులు, సర్ ఛార్జీలతో ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడేవారని అన్నారు. 'ఒక దేశం ఒకే పన్ను' అనే నినాదంతో ప్రధాని మోదీ తెచ్చిన జీఎస్టీ, ఇప్పుడు రెండు శ్లాబులతో మరింత సరళతరంగా మారిందని ప్రశంసించారు. ప్రభుత్వానికి ఆదాయం పెరిగితేనే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు చేయగలమని, సంపద సృష్టించని వారికి సంక్షేమం చేసే అధికారం లేదని స్పష్టం చేశారు. నూతన సంస్కరణల వల్ల కలిగే ప్రయోజనాలను ముఖ్యమంత్రి సభకు వివరంగా తెలిపారు. దాదాపు 99 శాతం వస్తువులు 5 శాతం పన్ను పరిధిలోకి రావడం వల్ల పేద, మధ్యతరగతి వర్గాలపై భారం గణనీయంగా తగ్గుతుందని అన్నారు. సబ్బులు, టూత్‌పేస్టులు, షాంపూలు, నెయ్యి వంటి నిత్యావసరాలు చౌకగా లభిస్తాయని చెప్పారు. అదేవిధంగా ఏసీలు, ఫ్రిజ్‌ల వంటి ఎలక్ట్రానిక్ వస్తువుల ధరలు కూడా తగ్గుముఖం పడతాయని తెలిపారు. నిర్మాణ రంగంలో కీలకమైన సిమెంట్, స్టీల్ వంటి వస్తువులు 5 శాతం శ్లాబులోకి రావడం వల్ల ఇళ్ల నిర్మాణం పుంజుకుంటుందని, సామాన్యుడి సొంతింటి కల నెరవేరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జీవిత, ఆరోగ్య బీమా పాలసీలపై జీఎస్టీని సున్నా శాతానికి తగ్గించడం చారిత్రాత్మకమని చంద్రబాబు అన్నారు. దీనివల్ల రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా ఏపీకి ఏటా రూ.750 కోట్ల వరకు ఆదా అవుతుందని వివరించారు. వ్యవసాయ రంగంలో ఉపయోగించే అగ్రిటెక్ యంత్రాలపై పన్ను తగ్గించడం రైతులకు ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. ఈ సంస్కరణల ఫలితంగా దేశంలో పన్ను చెల్లింపుదారుల సంఖ్య 1.51 కోట్లకు, జీఎస్టీ వసూళ్లు రూ.22 లక్షల కోట్లకు పెరిగాయని గుర్తుచేశారు. ఈ ప్రయోజనాలు రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ, చిట్టచివరి వ్యక్తికీ చేరేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, దీనిపై రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడతామని ముఖ్యమంత్రి ప్రకటించారు.

## విధుల్లో కంట్రోలర్ గాఢ నిద్ర..
## గాల్లోనే 18 నిమిషాలు చక్కర్లు కొట్టిన విమానం!

**పారిస్, సెప్టెంబర్ 18 :** పారిస్‌లోని ఓర్లీ విమానాశ్రయం నుంచి కార్సికాలోని అజాక్సియోకు బయలుదేరిన ఎయిర్ కార్సికా విమానానికి ఒక విచిత్రమైన అనుభవం ఎదురైంది. విమానం ల్యాండ్ కావాల్సిన సమయానికి... అజాక్సియో విమానాశ్రయంలోని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ విధుల్లో ఉండగానే నిద్రపోయారు. దీనితో పైలట్‌కు ల్యాండింగ్‌కు సంబంధించిన సూచనలు అందలేదు. రన్‌వేపై లైట్లు వెలగకపోవడంతో అనుమానం వచ్చిన పైలట్, విమానాన్ని దించకుండా గాల్లోనే తిప్పడం మొదలుపెట్టారు. దాదాపు 18 నిమిషాల పాటు విమానం మధ్యధరా సముద్రంపైనే చక్కర్లు కొడుతూ ఉంది. మరోవైపు, విమానాశ్రయంలోని అగ్నిమాపక సిబ్బంది కంట్రోల్ టవర్‌ను సంప్రదించడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. వారికి ఎటువంటి స్పందన రాకపోవడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. చివరకు విమానాశ్రయ సిబ్బంది, పోలీసులు కలిసి టవర్‌పైకి వెళ్లి నిద్రిస్తున్న కంట్రోలర్‌ను మేల్కొలిపారు. ఆ తరువాత ఆయన రన్‌వే లైట్లను వెలిగించి విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేయించారు. ఈ ఘటనపై ఫ్రాన్స్ సివిల్ ఏవియేషన్ అథారిటీ స్పందిస్తూ, విమానం రావాలసిన సమయం కంటే గంట ఆలస్యమైందని, ఆ సమయంలో టవర్‌లో ఆ ఉద్యోగి ఒక్కరే విధుల్లో ఉన్నారని, ఈ క్రమంలోనే ఆయన నిద్రలోకి జారుకున్నారని వివరించింది. విమానాన్ని బాస్టియా నగరానికి మళ్లించాలని భావిస్తున్న సమయంలో సమస్య పరిష్కారం కావడంతో అధికారులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

## బతుకమ్మ, దసరాకు టీజీఎస్‌ఆర్టీసీ భారీ ఏర్పాట్లు..

**హైదరాబాద్, సెప్టెంబర్ 18** బతుకమ్మ, దసరా పండగల నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ) భారీ ఏర్పాట్లు చేసింది. పండగ కోసం సొంతూళ్లకు వెళ్లేవారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 7,754 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ప్రకటించింది. ఈ ప్రత్యేక సర్వీసులు సెప్టెంబర్ 20 నుంచి అక్టోబర్ 2 వరకు అందుబాటులో ఉంటాయని తెలిపింది. ఈ నెల 30న సద్దుల బతుకమ్మ, అక్టోబర్ 2న దసరా పండగ ఉండటంతో సెప్టెంబర్ 27 నుంచే ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంటుందని ఆర్టీసీ అంచనా వేస్తోంది. దీనికి అనుగుణంగా బస్సులను సిద్ధం చేసింది. హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, జేబీఎస్, సీబీఎస్‌తో పాటు కేపీహెచ్‌బీ, ఉప్పల్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, ఆరాంఘర్ వంటి రద్దీ ప్రాంతాల నుంచి ఈ ప్రత్యేక బస్సులను నడపనున్నారు. తెలంగాణలోని అన్ని జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రలకు కూడా ఈ సర్వీసులు అందుబాటులో ఉంటాయి. ప్రయాణికుల సౌకర్యార్థం 377 ప్రత్యేక బస్సులకు ఆన్‌లైన్‌లో ముందస్తు రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించారు. ఈ సందర్భంగా టీజీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ మాట్లాడుతూ, ప్రయాణికులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. "గత ఏడాదితో పోలిస్తే ఈసారి అదనంగా 617 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశాం. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో షామియానాలు, తాగునీరు, కుర్చీలు వంటి సౌకర్యాలతో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేస్తున్నాం. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులను అందుబాటులో ఉంచేందుకు పర్యవేక్షక అధికారులను నియమించాం" అని ఆయన వివరించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం, తిరుగు ప్రయాణంలో ఖాళీగా వచ్చే ప్రత్యేక బస్సులకు అయ్యే డీజిల్ ఖర్చుల మేరకు మాత్రమే ఛార్జీలను సవరిస్తున్నట్లు సజ్జనర్ స్పష్టం చేశారు. ఈ సవరించిన ఛార్జీలు సెప్టెంబర్ 20, 27 నుంచి 30 వరకు, అలాగే అక్టోబర్ 1, 5, 6 తేదీల్లో నడిచే స్పెషల్ బస్సులకు మాత్రమే వర్తిస్తాయని, రెగ్యులర్ సర్వీసుల ఛార్జీలలో ఎలాంటి మార్పు ఉండదని ఆయన తేల్చిచెప్పారు. ప్రయాణికులు భద్రత లేని ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించవద్దని, ఆర్టీసీ బస్సుల్లో సురక్షితంగా ప్రయాణించాలని ఆయన సూచించారు. ముందస్తు రిజర్వేషన్ల కోసం అధికారిక వెబ్‌సైట్ https://tgsrtcbus.in ను సందర్శించాలని, ఇతర వివరాల కోసం 04069440000, 040 23450033 నంబర్లలో సంప్రదించాలని ఆర్టీసీ యాజమాన్యం కోరింది.

## రేవంత్ రెడ్డితో
## బ్రిటన్ హైకమిషనర్ భేటీ..

**హైదరాబాద్, సెప్టెంబర్ 18** తెలంగాణ విద్యార్థులకు ఉన్నత విద్యను మరింత చేరువ చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఒక ముఖ్యమైన ముందడుగు వేసింది. యూకే ప్రభుత్వం అందించే 'చెవెనింగ్ స్కాలర్‌షిప్స్'ను రాష్ట్రంలోని ప్రతిభావంతులైన విద్యార్థులకు అందజేయడానికి బ్రిటన్ అంగీకారించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో జరిగిన సమావేశంలో భారత బ్రిటీష్ హైకమిషనర్ లిండీ కామెరాన్ ఈ హామీ ఇచ్చారు. గురువారం జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో ఈ సమావేశం జరిగింది. కో ఫండింగ్ ప్రాతిపదికన ఈ స్కాలర్‌షిప్స్‌లను అందించడానికి ఆమె సుముఖత వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో విద్య, అభివృద్ధి, పెట్టుబడులకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. తెలంగాణలో ప్రభుత్వం తీసుకురానున్న నూతన విద్యా విధానం ముసాయిదాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బ్రిటీష్ హైకమిషనర్‌కు వివరించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రొఫెసర్ల నైపుణ్యాలను మెరుగుపరిచడానికి ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి కోరారు. దీనికి లిండీ కామెరాన్ సానుకూలంగా స్పందించారు. అనంతరం, రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ముఖ్యమంత్రి వివరించారు. ముఖ్యంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి ప్రాజెక్టులో బ్రిటీష్ కంపెనీలు భాగస్వాములు కావాలని ఆయన ఆహ్వానించారు. దీంతోపాటు గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్ (జీసీసీ), ఫార్మా, నాలెడ్జ్, అకాడమీ వంటి కీలక రంగాల్లో పెట్టుబడులు పెట్టేడానికి ముందుకు రావాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రతిపాదనలన్నింటికి బ్రిటీష్ హైకమిషనర్ లిండీ కామెరాన్ సానుకూలంగా స్పందించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ సమావేశంతో తెలంగాణ బ్రిటన్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలపడతాయని భావిస్తున్నారు.

## తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు భారీ భద్రతా ఏర్పాట్లు

**తిరుమల, సెప్టెంబర్ 18** తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు తిరుపతి జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు వెల్లడించారు. సెప్టెంబరు 24 నుంచి అక్టోబర్ 2 వరకు జరగనున్న ఈ ఉత్సవాల నేపథ్యంలో తీసుకుంటున్న చర్యలను ఆయన మీడియా సమావేశంలో వివరించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి మరింత పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈసారి బ్రహ్మోత్సవాల కోసం తిరుమల, తిరుపతిలో కలిపి మొత్తం 4,000 మంది పోలీసు సిబ్బందిని మోహరిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. వీరిలో 3,000 మంది తిరుమల కొండపై విధుల్లో ఉండగా, మరో 1,000 మంది తిరుపతి నగరంలో భద్రతను పర్యవేక్షిస్తారని చెప్పారు. పోలీసులతో పాటు టీటీడీకి చెందిన 1,500 మంది విజిలెన్స్ సిబ్బంది కూడా నిరంతరం క్షేత్రస్థాయిలో పనిచేస్తారని టీటీడీ ముఖ్య భద్రతా అధికారి మురళీకృష్ణ తెలిపారు. కేవలం సిబ్బందిని మాత్రమే కాకుండా, ఆధునిక టెక్నాలజీని కూడా భద్రత కోసం వినియోగిస్తున్నామని, తిరుమల, తిరుపతి వ్యాప్తంగా వ్యూహాత్మక ప్రాంతాల్లో మొత్తం 4,000 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తామని వివరించారు. బ్రహ్మోత్సవాలలో అత్యంత కీలకమైన గరుడ సేవ రోజున భక్తుల రద్దీ అసాధారణంగా ఉంటుందని, ఆ రోజు భద్రతా కారణాల దృష్ట్యా తిరుమల ఘాట్ రోడ్లపై ద్విచక్ర వాహనాల రాకపోకలను పూర్తిగా నిషేధిస్తున్నట్లు ఎస్పీ ప్రకటించారు. భక్తులు వ్యక్తిగత వాహనాలకు బదులుగా ఆర్టీసీ బస్సులను ఆశ్రయించడం శ్రేయస్కరమని సూచించారు. దూర ప్రాంతాల నుంచి వాహనాల్లో వచ్చేవారి సౌకర్యార్థం తిరుపతి నగరంలో ఐదు ప్రధాన ప్రాంతాల్లో విశాలమైన పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఆక్టోపస్, ఎన్‌డీఆర్‌ఎఫ్ వంటి ప్రత్యేక బృందాలను కూడా అందుబాటులో ఉంచినట్లు అధికారులు పేర్కొన్నారు. దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉండే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరాయంగా అన్నప్రసాదాలు, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. భక్తులు కూడా పోలీసుల సూచనలు, నిబంధనలు పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

## నేపాల్ నూతన ప్రధానికి మోదీ ఫోన్

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడారు. ఈ సంభాషణ ఎంతో ఆత్మీయంగా, భరోసా ఇచ్చేదిగా జరిగిందని ప్రధాని మోదీ తెలిపారు. ఇటీవల నేపాల్‌లో జరిగిన నిరసనలు, సంభవించిన ప్రాణనష్టం పట్ల ప్రధాని మోదీ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ క్లిష్ట సమయంలో నేపాల్‌కు అండగా నిలుస్తామని, అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. నేపాల్‌లో శాంతి, స్థిరత్వాన్ని పునరుద్ధరించేందుకు సుశీల కర్కి చేస్తున్న ప్రయత్నాలకు భారత్ పూర్తి అండదండలు అందిస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. ఈ సంభాషణ వివరాలను ప్రధాని మోదీ స్వయంగా 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. "నేపాల్ తాత్కాలిక ప్రభుత్వ ప్రధాని సుశీల కర్కితో ఆత్మీయంగా మాట్లాడాను. ఇటీవల జరిగిన ప్రాణనష్టంపై నా ప్రగాఢ సానుభూతిని తెలియజేశాను. శాంతి, స్థిరత్వాన్ని నెలకొల్పే ఆమె ప్రయత్నాలకు మా సంపూర్ణ మద్దతు ఉంటుందని మరోసారి హామీ ఇచ్చాను" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. అదేవిధంగా, శుక్రవారం జరగనున్న నేపాల్ జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సుశీల కర్కికి, నేపాల్ ప్రజలకు ప్రధాని మోదీ ముందుగానే శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఉన్నట్టుండి వస్తోంది.. కన్నీరు కురుస్తోంది

హైదరాబాద్: సమయం... గురువారం సాయంత్రం 4.30 గంటలు. ఉద్యోగులంతా కార్యాలయాల నుంచి ఇళ్లకు బయలుదేరే వేళ. ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమైంది. గంటసేపు ఆగకుండా కుండపోత వర్షం కురిసింది. రోడ్లన్నీ కాలువల్లా మారాయి. వరద కారణంగా వాహనాలు ఎక్కడివక్కడ ఆగిపోయాయి. మొత్తంగా రాత్రి 9.30 గంటల వరకు పలు ప్రాంతాల్లో రోడ్లపై ట్రాఫిక్ స్తంభించింది. ఇటీవల మహా నగరంలో ఆకస్మికంగా మేఘాలు గర్జిస్తున్నాయి. కుండపోత వానలు ఎక్కువయ్యాయి. రహదారులు కాలువలుగా, కాలనీలు తటాకాలుగా మారుతున్నాయి. లోతట్టులో ఉన్న ఇళ్లలోకి నీరు చేరి ప్రజలు అల్లాడుతున్నారు. గత ఆదివారం ముగ్గురు వ్యక్తులు నాలాల్లో కొట్టుకుపోయారు. ఎవరైనా గల్లంతైతే 24 గంటల తర్వాత మృతి చెందినట్లుగా అధికారికంగా ధ్రువీకరిస్తున్నారు. బుధవారం రాత్రి వరదలో చిక్కుకొని బల్కంపేట ప్రాంతంలో యువకుడు మృత్యువాత పడ్డారు. బుధవారం నుంచి గురువారం ఉదయం వరకు 24 గంటల వ్యవధిలో ముషీరాబాద్‌లో 18.4 సెం.మీ. వర్షం కురిసింది. దాని పరిధిలోని తొమ్మిది ప్రాంతాల్లో 13.5 సెం.మీ.పైగా వర్షపాతం నమోదైంది. మారేడుపల్లిలో 13.4, శేరిలింగంపల్లిలో 13, సికింద్రాబాద్‌లో 12.8, హిమాయత్‌నగర్‌లో 12.8, ఖైరతాబాద్‌లో 12.5 సెం.మీ. వర్షం కురిసింది. గురువారం సాయంత్రం నాలుగున్నర నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు బహదూర్‌పురలో 8.4 సెం.మీ నమోదైంది. చార్మినార్, నాంపల్లి, కాప్రా, బండ్లగూడలలో 6.8 నుంచి 6 సెం.మీ. మధ్య... ఖైరతాబాద్, ఆసిఫ్‌నగర్, అల్వాల్, ముషీరాబాద్‌లలో 5.5 నుంచి 5 సెం.మీ. మధ్య వర్షం కురిసింది. నగరంలో వర్షం పడితే రహదారులన్నీ మునిగి ఇంటికి చేరడానికి వాహనదారులు సతమతమవుతున్నారు. రెస్క్యూ బృందాలు ఎంత శ్రమించినా కనీసం ఐదారు గంటల సమయం పడుతోంది. గచ్చిబౌలి, హైటెక్‌సిటీ, కూకట్‌పల్లి, మాదాపూర్, మియాపూర్, జూబ్లీహిల్స్, అమీర్‌పేట, ఖైరతాబాద్, లక్డీకాపూల్, చాదర్‌ఘాట్, బహదూర్‌పుర, మెహిదీపట్నం, దిల్‌సుఖ్‌నగర్, కోఠి తదితర ప్రాంతాల్లో రోడ్లన్నీ వాహనాలతో నిండిపోతున్నాయి. మెట్రో రైళ్లు కిటకిటలాడుతున్నాయి.

**ముంపులోనే పలు కాలనీలు**

ముషీరాబాద్ ప్రాంతంలోని పలు కాలనీలు రెండు రోజులుగా ముంపులోనే ఉన్నాయి. గాంధీనగర్, అశోక్‌నగర్, హిమాయత్‌నగర్‌లోనూ కొన్ని అపార్టుమెంట్ల సెల్లార్లు మునిగాయి. పాతబస్తీలో పలు ప్రాంతాలు, ఖైరతాబాద్ బస్తీలు, అమీర్‌పేట, బల్కంపేటల్లో కొన్ని కాలనీలూ నీటిలోనే ఉన్నాయి. సికింద్రాబాద్, కంటోన్మెంట్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లోని పలుచోట్ల ఇవే వెతలు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం కృష్ణానగర్‌లో రహదారులపై రెండు మీటర్ల లోతున ప్రవాహం ఉంది. అనేకచోట్ల ఇళ్లముందు నిలిపి ఉంచిన పదుల సంఖ్యలో బైక్‌లు నాలాల్లో కొట్టుకుపోయాయి. ఈ దుస్థితికి కారణం తక్కువ సమయంలో ఎక్కువ వర్షం కురవడం ఒకటైతే... నాలాల నిర్వహణ సక్రమంగా లేకపోవడం మరో కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. నివాసాల్లో వరద ఇంకే ఏర్పాట్లు ఎక్కడా లేవు. ఇళ్లపై కురిసిన వర్షమంతా రోడ్లపైకే వస్తోంది. మొత్తం కలిసి ఏరులై ప్రవహిస్తోంది. మరోవైపు అవసరాలకు సరిపడా వరద కాలువల నిర్మాణం జరగలేదు. ఉన్నవాటిలో పూడిక తీయకపోవడం, ఆక్రమణలు పెరిగిపోవడంతో కుంచించుకుపోయాయి. వరద వచ్చినప్పుడు తీవ్రత తగ్గించడానికి ఏర్పాటు చేసిన భూగర్భ ట్యాంకులు సైతం నామమాత్రంగా మారాయి.

## విలాస విహారానికి రూ.7 కోట్లు

**మియామీ, సెప్టెంబర్ 18 :** ప్రపంచంలో విలాసవంతమైన క్రూజ్‌లను నడిపే సంస్థ 'రీజెంట్ సెవెన్ సీస్'. ఇది తాజాగా తన అత్యంత ఖరీదైన క్రూజ్‌లో ప్రయాణానికి సంబంధించిన వివరాలను విడుదల చేసింది. 2027లో ప్రారంభమయ్యే ఈ "వరల్డ్ ఆఫ్ స్ప్లెండర్" క్రూజ్.. ఆరు ఖండాల్లోని 40 దేశాలు, 71 పోర్టుల మీదుగా మొత్తం 140 రోజులు కొనసాగుతుంది. ఈ క్రూజ్‌లో ప్రారంభ టికెట్ ధరే రూ.80లక్షలు. ఇక రీజెంట్ సూట్ (అత్యంత విలాసవంతమైన సూట్) ధరను రూ.7.3 కోట్లుగా ప్రకటించారు. 4,000 చదరపు అడుగులు ఉన్న ఈ సూట్‌లో దిగిన వారికి ప్రతి పోర్టులో పర్యటించడానికి ఓ ప్రైవేటు కారు, డ్రైవరును ఏర్పాటుచేస్తారు. అమెరికాలోని మియామీలో మొదలై, తిరిగి న్యూయార్క్‌లో ముగుస్తుంది. లాస్ ఏంజెలిస్, సిడ్నీ, సింగపూర్, మలీబు, ముంబయి నగరాల్లో రాత్రి బస కల్పిస్తారు. ఇందులో 744 మంది పర్యాటకులు ప్రయాణిస్తారు. 548 మంది సిబ్బంది ఉంటారు.

## మీ అభ్యంతరాలను అఫిడవిట్ రూపంలో ఇవ్వండి

హైదరాబాద్: పార్టీ ఫిరాయింపు నోటీసులపై సమాధానాలిచ్చిన 8 మంది ఎమ్మెల్యేల వివరణలపై తమ అభ్యంతరాలను అఫిడవిట్ రూపంలో అందజేయాలని.. ఫిర్యాదు చేసిన సంబంధిత భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యేలకు గురువారం శాసనసభ కార్యదర్శి వి.నరసింహాచార్యులు మరోసారి లేఖలు పంపించారు. స్పీకర్ వద్ద విచారణలో భాగంగా.. నోటీసులు స్వీకరించిన ఎమ్మెల్యేలు, ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యేల వాదనలుంటాయి కాబట్టి.. తదుపరి విచారణ కోసం లీగల్ ఫార్మాట్‌లో అభ్యంతరాలను ఇవ్వాలని ఆ లేఖల్లో పేర్కొన్నారు. లేఖ అందిన మూడు రోజుల్లోగా అందించాలని గడువు విధించారు. భారత రాష్ట్ర సమితి అభ్యర్థులుగా ఎన్నికల్లో గెలిచి.. కాంగ్రెస్‌లో చేరారని, వీరిపై అనర్హత వేటు వేయాలని కోరుతూ భారత రాష్ట్ర సమితికే చెందిన ఎమ్మెల్యేలు సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. 3 నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు సర్వోన్నత న్యాయస్థానం సూచించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సభాపతి వీరి నుంచి వివరణ కోరుతూ నోటీసులు జారీచేయగా.. తాఖీదులు అందుకున్న 10 మంది ఎమ్మెల్యేల్లో.. బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి (గద్వాల), అరికెపూడి గాంధీ (శేరిలింగంపల్లి), సంజయ్ (జగిత్యాల), గూడెం మహిపాల్‌రెడ్డి (పటాన్‌చెరు), పోచారం శ్రీనివాస్‌రెడ్డి (బాన్సువాడ) ప్రకాశ్‌గౌడ్ (రాజేంద్రనగర్), కాలె యాదయ్య (చేవెళ్ల), తెల్లం వెంకట్రావు (భద్రాచలం) స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు లిఖితపూర్వకంగా సమాధానాలిచ్చారు. వీరితోపాటు నోటీసులు స్వీకరించిన శాసనసభ్యులు కడియం శ్రీహరి (స్టేషన్ ఘన్‌పూర్), దానం నాగేందర్ (ఖైరతాబాద్) మాత్రం ఇంకా సమాధానాలివ్వలేదని తెలుస్తోంది.

# ఈ నెల 20 నుంచి కూకట్ పల్లి లో బతుకమ్మ సంబరాలు

కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : ఈ నెల 20 నుంచి కూకట్ పల్లి లో బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని విజయదశమి బతుకమ్మ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతి సంవత్సరం కూకట్ పల్లి లో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించటం ఆనావాయితీగా వస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే అత్యంత వైభవంగా బతుకమ్మలను ఆడపడుచుల ఆటపాటల నడుమ పూజించి గంగమ్మ ఒడిలో నిమజ్జనం చేయటం వంటి వేడుకలు కూకట్ పల్లి తో పాటు చుట్టు ప్రక్కల ప్రాంతాల వారికి కన్నుల పండుగల దర్శనం ఇస్తాయన్నారు. ఇట్టి కార్యక్రమం యావత్తు రాష్ట్రంలోనే అమావాస్యకు ఒక్కరోజు ముందుగా ఈ నెల 20 నుండి సాయంత్రం 5 గంటలకు నుండి కూకట్ పల్లి గ్రామం నందు హనుమాన్ దేవాలయం వద్ద భారీగా బతుకమ్మ ఉత్సవాలు జరుగుతాయన్నారు. ఇక్కడ బతుకమ్మ ఆడిన తరువాత రోడ్డు ఆవతలి వైపున పి.ఎన్.యం. స్కూల్ నందు బతుకమ్మ ఆడి రంగాధాముని చెరువులో బతుకమ్మలు నిమజ్జనం చేస్తారన్నారు. 20 తారీకున మొదలుకొని తొమ్మిది రోజులు పాటు ఘనంగా వేడుకలు జరుపుకొని ఈ నెల 29న సద్దుల బతుకమ్మతో ముగుస్తాయన్నారు.

**సద్దుల బతుకమ్మ సంబరాలు**

ఈ నెల 29 ను సద్దుల బతుకమ్మ సంబరాలను కూకట్ పల్లి నియోజకవర్గం యం.ఎల్.ఎ మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించటం జరుగుతుందన్నారు. రంగాధాముని చెరువు (ఐ.డి.ఎల్) కట్ట పై ప్రత్యేక ఏర్పాట్ల నడుమ వేలాది మంది హాజరై బతుకమ్మలను ఘనంగా ఆటపాటలతో పూజించి నిమజ్జనం చేస్తారన్నారు. ఆత్యంత వైభవోపేతంగా ఆకట్టుకొనేలా ఆలంకరించిన బతుకమ్మలకు ప్రత్యేక ప్రోత్సాహక బహుమతులను కూడ యం.ఎల్.ఎ మాధవరం కృష్ణారావు చేతుల మీదుగా అందచేయటం జరుగుతుందన్నారు. బతుకమ్మ వేడుకలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నాట్య ప్రదర్శనలు వంటి ఆదనపు కార్యక్రమాలతో సద్దుల బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతాయన్నారు. బతుకమ్మ వేడుకలు ఈ నెల 20న బతుకమ్మ ప్రారంభం, 21 న పెద్దల అమావాస్య, 27న అట్ల బతుకమ్మ, 28 న ఆలిగిన బతుకమ్మ (బతుకమ్మ ఉండదు)అని తెలిపారు. అక్టోబర్ 2న విజయదశమి కూకట్ పల్లి రామాలయం లో సాయంత్రం 5. 30 విజయదశమి వేడకలు జరుగుతాయని తెలిపారు.



## నూతన పైప్ ఫిటింగ్, వైరింగ్, లైట్స్ ఏర్పాటుతో

*** హనుమాన్ ఆలయంలో నూతన వెలుగులు**



స్టేషన్ ఘన్పూర్, ప్రజాస్ఫూర్తి : స్టేషన్ ఘనపూర్ డివిజన్ కేంద్రంలోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయం లో గత కొన్ని రోజులుగా షార్ట్ సర్క్యూట్ తో లైట్స్ అన్ని కాలిపోయి వెలగడం లేదు ఈ సమస్య పై బజరంగ్ దళ్ జనగామ జిల్లా కన్వీనర్ గోనెల రమేష్ స్పందించి సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా ధాత గోనెల శివ ( ఎలక్ట్రిషియాన్ ) స్పందించి నూతన పైప్ ఫిటింగ్, వైరింగ్, లైట్స్ ఏర్పాటుకు ముందుకు రావడం తో గురువారం స్టేషన్ ఘన్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని చెరువు కట్టమీద ఉన్నటువంటి హనుమాన్ దేవాలయంలో నూతన లైట్స్ ని ఫిటింగ్ చేయడం జరిగింది ఈ కార్యక్రమం లో కుంభం కుమారస్వామి, గోనెల రాకేష్, నీల అనిల్, గొడుగు రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు

## రాజపేట లో బిజెపి స్వచ్ఛభారత్



రాజాపేట, ప్రజాస్ఫూర్తి : రాజపేట బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో సేవ పక్షం కార్యక్రమంలో భాగంగా గురువారం స్వచ్ఛభారత్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దాచపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు అయిన మలేరియా, డెంగ్యూ వచ్చే అవకాశం ఉన్నందున పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ శాఖ అధ్యక్షులు సాధనబోయిన శంకర్, సేవ పక్షం కన్వీనర్ బూర్గు శేఖర్ రెడ్డి, కుమ్మరి లక్ష్మణ్ , ప్రధాన కార్యదర్శి మెండు భగవాన్ రెడ్డి, బూత్ అధ్యక్షులు చిగుల్ల బీరయ్య, సోమసాని చంద్రమోహన్, బూర్గు వెంకట్, సీనియర్ నాయకులు దిడ్డి నరసింహులు, ఎక్కల దేవి శ్రీహరి, బొంగోని నర్సింహులు , బండి సిద్దులు తదితరులు పాల్గొన్నారు.

## మదర్ డైరీ డైరెక్టర్ గా నామినేషన్ వేసిన సంధిల భాస్కర్ గౌడ్



రాజాపేట ,ప్రజాస్ఫూర్తి : మదర్ డైరీ డైరెక్టర్ గా గురువారం రాజపేట పాలసోసైటీ చైర్మన్ సంధిలా భాస్కర్ గౌడ్ నామినేషన్ దాఖలు చేశారు. హయత్ నగర్ లోని మదర్ డైరీ కార్యాలయంలో ఖాళీ అయిన మూడు డైరెక్టర్ల స్థానాలకు ఎన్నికల అధికారి వెంకట్ రెడ్డి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయగా ఈ నెల 27వ తేదీన ఖాళీ అయినా మూడు డైరెక్టర్ స్థానానికి ఎన్నికలు నిర్వహించుచున్నారు. ఒక జనరల్ డైరెక్టర్ స్థానానికి నామినేషన్ దాఖలు చేసారు.ఈ సందర్భంగా భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ మదర్ డైరీ లో డైరెక్టర్ గా చైర్మన్ సోదరులందరూ ఆశీర్వదిస్తే వారి కోసం ముందు వరుసలో నిలబడి పని చేస్తానని హామీ ఇచ్చారు.బడుగు బలహీన వర్గాల నాయకునిగా ఒక అవకాశం ఇవ్వమని సంధిల భాస్కర్ గౌడ్ కోరారు. గత ఏడాది కూడా డైరెక్టర్ గా నామినేషన్ వేసి ఎన్నికల్లో పోరాడితే 103 ఓట్లు వేసి తనను విజయం అంచుల దాకా తీసుకువెళ్లారని గుర్తు చేశారు.ఈసారి తప్పక ఆశీర్వదిస్తారని నమ్ముతూ నామినేషన్ వేయడం జరిగినదని భాస్కర్ గౌడ్ చెప్పారు.




## మొక్కలతోనే ఆహ్లాదకరమైన వాతావరణం

*** 13, 18, 19వార్డుల సందర్శన**
*** మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: పార్కుల్లో, రోడ్ల వెంట, ఖాళీ స్థలాలలో ఆహ్లాదకరమైన వాతావరణం తలపించేలా మొక్కలను విరివిగా నాటాలని చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ గుత్తా వెంకటరామిరెడ్డి అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని 13, 18, 19వార్డులను గురువారం సందర్శించారు. 18వ వార్డులోని పైలాన్ పార్కులో ఉన్న ఓపెన్ జిమ్ పరికరాలను పరిశీలించారు. పిచ్చి మొక్కలను తొలగించి పార్కును పరిశుభ్రంగా ఉంచాలని అక్కడి సిబ్బందిని ఆదేశించారు. అనంతరం 19వ వార్డులోని ఊర చెరువును సందర్శించారు. చెరువు కట్టపై పూల మొక్కలను నాటించారు. వెంకటరమణ కాలనీవాసుల ఫిర్యాదు మేరకు ఆ కాలనీని సందర్శించారు. వెంకటరమణ కాలనీలో డ్రైనేజీ, రోడ్డు పనులను చేపట్టేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి




మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకాన్ని బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరు పాటించాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతోనే అంటు వ్యాధులను నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్, ఈఈ రేణుకుమార్, వార్డ్ ఆఫీసర్లు కుమార్, రాఘవ, కాలనీవాసులు నందగిరి పరమేష్, స్వామి, మహేష్, జానిమియా పాల్గొన్నారు.



## నిరుపేద చేర్యాల యాదగిరి కుటుంబానికీ రూ.5,000 ఆర్థిక సాయం

రాజాపేట ,ప్రజా స్ఫూర్తి : రాజాపేట మండలం కాల్వపల్లి గ్రామానికీ చెందిన నిరుపేద అయిన చేర్యాల యాదగిరి అనారోగ్యం తో మరణించగా కుటుంబానికి కీర్తిశేషులు ఇంజ నర్సయ్య ఫౌండేషన్ చైర్మన్, ఆలేరు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు ఇంజ నరేష్ 5,000/రూపాయలు కుటుంబ సభ్యులకు చేర్యాల లక్ష్మయ్య బాలయ్య లకు అందజేశారు. అలాగే బీర్ల ఫౌండేషన్ నుంచి వచ్చే బియ్యాన్ని కూడా వారి కుటుంబానికి త్వరలో అందిస్తామని హామీ ఇచ్చారు కుటుంబానికి ధైర్యం చెప్పారు ఈ కార్యక్రమంలో కళ్లెం పాండు,ఇంజ శ్రీరాములు, ఇంజ స్టీవెన్, చేర్యాల నాగయ్య, ఇంజ బాబు,ఇంజ దాస్, చేర్యాల నరేష్,వినోద్,ఇంజ మల్లయ్య, వట్టిపల్లి సిద్దులు ఇంజ నవిన్, చేర్యాల రామకృష్ణ, చేర్యాల బాబు, ఇంజ స్వామి,ఇంజ కర్ణకర్,ఇంజ సాయి,ఇంజ శ్రీకాంత్,ఇంజ బాబూరావు,ఇంజ నరేష్, వేల్పుల జేయంత్,ఇంజ బబ్లు, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కాకల్ల శ్రీకాంత్, సుధాకర్, రఘు, ఇతర కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకులు పాల్గొన్నారు



## బొమ్మల రామారాం మండలంలో కేంద్రంలో బీజేపీ సేవా పక్షం కార్యక్రమం

యాదగిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : బొమ్మల రామారాం బీజేపీ మండల అధ్యక్షుడు మాలోత్ వినోద్ కుమార్ జాదవ్ సారధ్యంలో భారతీయ జనతా పార్టీ సేవా పక్షం కార్యక్రమం లో భాగంగా స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని బొమ్మల రామారాం మండల కేంద్రం లో శక్తి కేంద్రం పరిధిలో స్వచ్ఛభారత్ మండల కన్వీనర్ ఆనంద్ గౌడ్, మౌనిక, సాయి కుమార్ ఆధ్వర్యంలో బొమ్మల రామారాం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ హాజరు కావడం జరిగింది. వారు మాట్లాడుతూ ప్రజలకు సేవ చేసే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు శుభ్రంగా ఉండాలని, అందుకు అనుగుణంగా గురువారం ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వాసుపత్రిలో నిర్వహించడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమములో భారతీయ జనతా పార్టీ బిజెపి మండల నాయకులు ఉపాధ్యక్షుడు బిమారి రాజు, కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, మాజీ మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, కిసాన్ మోర్చా మాజీ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి ,సినియర్ నాయకులు రవిశంకర్, డాక్టర్ పాండు, బాలకృష్ణారెడ్డి, గుండ్ల గోపాల్, ఈశ్వర్ గౌడ్,చీర గణేష్,ప్రవీణ్ రెడ్డి, మహేష్, రాము నాయక్, సతీష్, పరమేష్ నాయక్, రమేష్, జహంగీర్ వివిధ గ్రామాల బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## పేద విద్యార్థికి డిఎస్ఆర్ సత్యం ఫౌండేషన్ ఆర్థిక సహాయం



ప్రజాస్ఫూర్తి, నల్లగొండ :నల్గొండ జిల్లా నల్గొండ పట్టణం కి చెందిన చిన్న పాక రితీష్ , చిన్న పాక రాకేష్ లు ఎంబిబిఎస్ చదువుతున్న విద్యార్థులకు హాస్టల్ ఫీజు కొరకై డిఎస్ఆర్ సత్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం దోనాల శ్రీనివాస్ రెడ్డి రూ.12000 ఆర్థిక సాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా డిఎస్ఆర్ సత్యం ఫౌండేషన్ చైర్మన్ దోనాల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ. పేద విద్యార్థుల్లో ప్రతిభను, వారి మేదో శక్తిని గుర్తించి వారికి ఆర్థిక సాయం చేయడం నాకు చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శంకర్ , సతీష్ రెడ్డి , మనోజురెడ్డి,రవి గౌడ్, కిషోర్ బాబు వర్ధన్ తదితరులు పాల్గొన్నారు

## విద్యుత్ సమస్యలపై ప్రగతి నగర్ లో పర్యటించిన అధికారులు



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : బాలాజీ నగర్ డివిజన్ ప్రగతి నగర్ కాలనీ లో గురువారం నిర్వహించిన బస్తి బాటలో భాగంగా విద్యుత్ అధికారులు ప్రగతి నగర్ , శ్రీ హరి నగర్ లలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రగతి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ భూమండ్ల అశోక్ , జనరల్ సెక్రెటరీ జిట్టా సునీల్ యాదవ్ లు అధికారులకు ప్రగతి నగర్ లో విద్యుత్ సమస్యలపై వివరించారు. కాలనీలో గత కొంత కాలంగా విద్యుత్ సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇందులో భాగంగా ప్రగతి నగర్ లో రెండు ట్రాన్స్ఫర్మర్లకు స్థలం చూపించారు. కరెంటు స్తంభాలు కరెంటు లైన్ చూపించారు. దీనికి ఎడీ మాణిక్యులు , ఎఈ భీమ లింగప్ప లు స్పందించి వెంటనే పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు జైరాజ్ ,అశోక్ ,నరేంద్ర ,సంతోష్ ,కృష్ణ బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## నిరంతరం మొక్కలు నాటుతున్న గ్రీన్ భద్రాద్రి సేవలు అభినందనీయం

*** సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: డిగ్రీ కళాశాల సమీపంలోని కరకట్ట వద్ద గ్రీన్ భద్రాద్రి ఆధ్వర్యంలో నిర్వహించిన వృక్షారోపణ కార్యక్రమంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ, లాభాపేక్షలేకుండా నిరంతరం మొక్కలు నాటి, వాటిని సంరక్షిస్తూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న గ్రీన్ భద్రాద్రి సేవలు ప్రశంసనీయమని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని పర్యావరణ హిత కార్యక్రమాలు చేపట్టాలని సూచిస్తూ, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు చిట్టె లలిత, కో ఆర్డినేటర్ పామరాజు తిరుమలరావు, పల్లింటి దేశప్ప, కామిశెట్టి కృష్ణార్జునరావు, గంగాధర వీరయ్య, బిర్రు సుధాకర్, రామరాజు, సుభాష్ నగర్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు




# ఆదివాసి కుటుంబాలకు దోమతెరల పంపిణీ

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండల పరిధిలోని ముద్దులగూడెం, కొత్తూరు కాలనీలలో నివసిస్తున్న 100 ఆదివాసి కుటుంబాలకు గురువారం దోమతెరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని మహర్షి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో, హైదరాబాద్‌కు చెందిన హార్ట్ టు హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో నిర్వహించారు.ట్రస్ట్ అధ్యక్షులు మూడే రవి నాయక్ తెలిపారు ప్రకారం ముద్దులగూడెం గ్రామంలోని 43 కుటుంబాలకు దాతలు జి. ప్రభాకర్ (డివిజనల్ ఇంజనీర్, లిఫ్ట్ ఇరిగేషన్, విద్యుత్ శాఖ), పి. వెంకటలక్ష్మి (అసిస్టెంట్ ఇంజనీర్, విశాఖ) సహకారంతో దోమతెరలు అందించారు.కొత్తూరు కాలనీలోని 56 కుటుంబాలకు ఈ. అమృత (అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్, విద్యుత్ శాఖ) సహకారంతో పంపిణీ చేపట్టారు.ఈ దోమతెరలు (6×6 సైజ్) కుటుంబాలందరికీ సరిపడా ఉండేలా, ముఖ్యంగా భార్యాభర్తలు, ఇద్దరు పిల్లలకు ఉపయోగపడేలా అందజేశామని తెలిపారు. వర్షాకాలంలో దోమకాటుతో అనారోగ్యం రాకుండా ఉండడం దీని ఉద్దేశ్యం.ఇకపై కూడా అవసరమైన చోట దుప్పట్లు, విద్యార్థులకు నోటుపుస్తకాలు, బట్టలు, నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తూ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని ట్రస్ట్ ప్రతినిధులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మహర్షి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు తోల్యం శ్రీనివాస్, సభ్యులు సతీష్, క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు

## కుషాయిగూడ ఈసీఐఎల్ ఫ్యాక్టరీలో మహిళల అవగాహన కార్యక్రమం




ప్రజాస్ఫూర్తి, కాప్రా : కుషాయిగూడలోని ఈసీఐఎల్ ఫ్యాక్టరీలో గురువారం మహిళలకు పోలీస్ శాఖ సేవలు, భద్రతా కార్యక్రమాలపై అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించబడింది.గృహ హింస, షీ టీమ్స్, సైబర్ నేరాలపై జాగృతి పోలీస్ కళాబృందం పాటల ద్వారా మహిళలకు అవగాహన కల్పించగా, కుషాయిగూడ చైల్డ్ అండ్ విమెన్ వెల్ఫేర్ (సీడిడబ్ల్యు) టీమ్ నుండి కౌన్సిలర్లు షారోన్, సవిత సీడిడబ్ల్యు సేవలపై వివరించారు.మహిళల భద్రత కోసం ముఖ్యమైన హెల్ప్‌లైన్ నంబర్ల గురించి కూడా ఈ కార్యక్రమంలో తెలియజేశారు.కుషాయిగూడ ఇన్స్పెక్టర్ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్ ఐ బి. శ్రీనివాస్, జాగృతి పోలీస్ కళాబృందం, సీడిడబ్ల్యు సిబ్బంది, ఈసీఐఎల్ ఫ్యాక్టరీ నుండి డాక్టర్ స్వాతి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళల భద్రత, సహాయ సేవలపై అవగాహన కల్పించారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: ఇల్లందు మండలంలోని 21 పిట్ జడ్పీ హైస్కూల్లో 198586సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించుకున్నారు. సుమారు 40 సంవత్సరాల తర్వాత అందరూ కలిసి వారు చదువుకున్న సమయంలో జరిగిన సంఘటన తీపి జ్ఞాపకాలను చేసుకుని సంతోషంగా గడిపారు.

## ఘనంగా ప్రపంచ వెదురు దినోత్సవ వేడుకలు




సంగారెడ్డి,ప్రజాస్ఫూర్తి 18: సంగారెడ్డి జిల్లా కేంద్రం లో ఘనంగా జరిగిన ప్రపంచ వెదురు దినోత్సవం జరిగింది. వెదురు ఉత్పత్తుల ప్రదర్శన కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మెన్ విజయ బి సి సంఘం నేతలు పాల్గొన్నారు.అనంతరం మాట్లాడుతూ వెదురు మీద ఆధారపడి జీవిస్తున్న మేదరి కుల వృత్తి దారులకు ప్రభుత్వాలు మరిన్ని సంక్షేమ పథకాలు పెట్టి వెదురు వృత్తి ని ప్రోత్సహించలని అన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ బొంగుల విజయ లక్ష్మి రవి మాట్లాడుతూ మెదరులు ఐక్యంగా ఉండి సంఘం సమస్యలు పరిష్కారం కొరకు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమం లో మేదరి మహేంద్ర సంఘం కో ఆర్డినేటర్ కుమార్, సంఘం జిల్లా అధ్యక్షులు నందికంటి నరసింహులు,ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు తోకల శ్రీశైలం,, వర్కింగ్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ మహేంద్ర, కోశాధికారి రాజు, ప్రచార కార్యదర్శి లక్ష్మి నారాయణ మహేంద్ర, పట్టణ అధ్యక్షులు ఆంజనేయులు, యువత అధ్యక్షులు శేఖర్, శ్రీనివాస్ నాయకులు ప్రమోద్, అనిల్, రాంచందర్ , ముత్తెకోట రాములు, ప్రవీణ్ ,శ్రీశైలం,శంకర్, లక్ష్మణ్ హన్మాండ్ల బాలరాజ్, పులి మల్లయ్య , గోపి, శ్రీనివాస్, బిక్షపతి,ఈశ్వర్,మల్లేష్ ప్రకాష్, యాదగిరి, నర్సింలు, ఓం ప్రకాష్,మహిళా నాయకులు సరిత, విజయ,మంగమ్మ,శ్రీలత, సంతోషి,లక్ష్మి, రజని, మమత, దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.



## చౌటుప్పల్ లో పశు సంవర్ధక శాఖ ఏడి కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలి

* **గొర్రెలకు ప్రభుత్వం ఉచిత ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి**
* **జిఎంపిఎస్ ఆధ్వర్యంలో ఆర్డీవోకు వినతి**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ రెవిన్యూ డివిజన్ కేంద్రంలోపశుసంవర్ధక శాఖ ఏడి కార్యాలయాన్నిఏర్పాటు చేయాలని గొర్రెల మేకల పెంపకందారుల సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా గౌరవ అధ్యక్షుడు బండారు నరసింహ, మండల కార్యదర్శి కొండే శ్రీశైలంలు కోరారు. గొర్రెల మేకలు పెంపకం దారుల సంఘం ఆధ్వర్యంలో చౌటుప్పల్ మండల కేంద్రంలో ఆర్డీవో కార్యాలయం వద్ద ఆర్డీవో శేఖర్ రెడ్డికి సమస్యలపై గురువారం వినతి పత్రం అందజేశారు. అంతకుముందు బండారు నరసింహ, కొండే శ్రీశైలంలు మాట్లాడుతూ జీవాలకు ప్రతి సంవత్సరం ప్రభుత్వం నట్టల నివారణ మందులు పంపిణీ చేస్తుందని, కానీ, గత రెండున్నర సంవత్సరాలుగా గొర్రెల నట్టల నివారణ మందులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పెంపకం దారులు చేసేదేమీ లేక ప్రైవేటు మెడికల్ షాపులను ఆశ్రయిస్తున్నారని, వేలాది రూపాయలతో మందులను కొలుగోలు చేసి తీవ్ర ఇబ్బందుల గురవుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే గొర్రెలకు నట్టల నివారణ మందులు అందించాలని విన్నవించారు. అదేవిధంగా పశు సమర్ధక శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని పేర్కొన్నారు. గొర్రెలకు ప్రభుత్వం ఉచిత ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, 50సంవత్సరాలు నిండిన ప్రతి గొర్రెల, మేకల పెంపకందారులకు వృద్ధాప్య పెన్షన్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం మండల అధ్యక్షుడు భీమనగొని బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు జెనిగల యాదయ్య, ఐలయ్య, మండల సహాయ కార్యదర్శి గజ్జి పాండు, అరిగె బీరప్ప, జంగయ్య, వెంకటేష్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.




## లొంగిపోయిన ఆరుగురు మావోయిస్టులు

* **ఒక్కొక్కరికి రూ.25 వేల తక్షణ సాయం అందజేత**
* **ఆపరేషన్ చేయూతకు విశేష స్పందన: ఎస్పీ రోహిత్ రాజ్**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: నిషేధిత మావోయిస్టు పార్టీకి చెందిన ఆరుగురు సభ్యులు లొంగిపోయినట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ వెల్లడించారు. గురువారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆపరేషన్ చేయూత కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని, జనవరి 2025 నుంచి ఇప్పటివరకు మొత్తం 320 మంది మావోయిస్టులు లొంగిపోయారని తెలిపారు. ఇటీవల మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యురాలైన పోతుల పద్మావతి అలియాస్ కల్పన 13.09.2025న రాష్ట్ర డీజీపీ ఎదుట లొంగిపోయిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుతం లొంగిపోయినవారు మడకం దేవ, మడవి జోగ, పొడియం దేవ, మడకం ఇడుమాస్, మడకం ముక, మడివి ఇత అని వివరించారు. వీరికి తక్షణ సహాయంగా ఒక్కొక్కరికి రూ.25 వేలు చొప్పున మొత్తం రూ.1,50,000 అందజేశారు. ఆధార్ కార్డులు, బ్యాంక్ అకౌంట్‌లు పూర్తయిన తరువాత ర్యాంకుల వారీగా రావలసిన మిగతా సౌకర్యాలు చెక్కుల రూపంలో అందజేస్తామని ఎస్పీ తెలిపారు.ఆదివాసీల అభివృద్ధి, సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం, పోలీస్ శాఖ కృషి చేస్తోందని, పాఠశాలలు, వైద్యశాలలు, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పించడంతో పాటు గిరిజన ప్రాంతాల్లో నాణ్యమైన విద్య, వైద్య సౌకర్యాలను మరింతగా బలోపేతం చేస్తున్నామని ఎస్పీ రోహిత్ రాజ్ తెలిపారు.



## నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలి

* **మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్**

ప్రజాస్ఫూర్తి, కాప్రా: నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయాలను సాకారం చేసేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు. గురువారం నేతాజీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేతాజీ నగర్ పార్కులో ఘనంగా ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేతాజీ సుభాష్‌చంద్రబోస్ స్వాతంత్ర్య సమరంలో చూపిన త్యాగం, సాహసం, నాయకత్వం ఈ తరానికి ఆదర్శం. ఆయన చూపిన మార్గంలో నడిచేలా యువతతో పాటు అందరూ కృషి చేయాలి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు బైరి నవీన్ గౌడ్ కాలనీ అధ్యక్షుడు ఇంద్రపాల్ వైస్ ప్రెసిడెంట్ అనిల్ రెడ్డి శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి యాష్పాల్ గౌడ్ స్థానికులు తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రజలు నేతాజీ విగ్రహావిష్కరణను హర్షాతిరేకాలతో స్వాగతించగా, నాయకులు ప్రజలతో కలసి నేతాజీకి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

## కాప్రా చెరువు కట్టను పరిశీలించిన ఎమ్మెల్యే, ఎంపీ



ప్రజాస్ఫూర్తి, కాప్రా: కాప్రా చెరువును ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ గురువారం స్థానికులతో కలిసి పరిశీలించారు. చెరువు తూము ద్వారా నీరు బయటకు వెళ్తోందని స్థానికులు ఎమ్మెల్యే, ఎంపీ దృష్టికి తీసుకెళ్లగా, ఇరిగేషన్ అధికారులతో కలిసి సమస్యను పరిశీలించి, ఎమ్మెల్యే స్వంత నిధులతో తూము మూసివేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బీజేపీ నాయకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు

* **ఇల్లందు డిఎస్పీ చంద్రభాను**
* **వినోభా నగర్లో కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాం**



ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు ఇల్లందు డిఎస్పి చంద్రభాను, ఆధ్వర్యంలో గురువారం ఇల్లందు పోలీస్ స్టేషన్ పరిధిలోని వినోభా నగర్లో కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాం ను నిర్వహించారు. ఇందులో భాగంగా మొత్తం సుమారుగా 250 ఇండ్లలో సోదాలు నిర్వహించడం జరిగింది. సరిగా పత్రాలు లేకుండా నెంబర్ ప్లేట్లు లేని 70 ద్విచక్ర వాహనాలను,03 ఆటోలను,ఒక కారును సీజ్ చేయడం జరిగింది.అనంతరం వినోభా నగర్ వాసులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి ఇల్లందు డిఎస్పి చంద్రభాను పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్ట వ్యతిరేక మరియు సాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల గురించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలని కోరారు.తమ ప్రాంతంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.మట్కా,జూదం,బెట్టింగ్,గంజాయి రవాణా వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేయడమైనదని తెలిపారు.అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలియజేసారు.విపత్కర సమయాల్లో ఆపదలో ఉన్నప్పుడు డయల్ 100 నకు ఫోన్ చేసి పోలీస్ వారి సేవలను పొందాలని తెలిపారు.సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.నేరాల నియంత్రణ కొరకు తమ నివాస ప్రాంతాలలో సీసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సుమారుగా 100 మందికి పైగా పోలీస్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ తల్లి చేతుల్లోకి మళ్లీ బతుకమ్మ రావాలి

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో తీసుకొచ్చిన ప్రతీ పథకం వెనుక ఆడబిడ్డల క్షేమం ఉందని మాజీమంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. గురువారం తెలంగాణ భవన్‌లో బతుకమ్మ సీడీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, మహిళా నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగను కేసీఆర్ గొప్పగా నిర్వహించారని.. ఈ సారి మూడు బతుకమ్మ పాటలు ప్రత్యేకంగా రాయించామని తెలిపారు. పండుగకు కేసీఆర్ ఆడబిడ్డలకు చీరలు కానుక ఇచ్చారని.. ఆదివాసులు కూడా బతుకమ్మ పండుగ జరుపుకుంటున్నారని చెప్పారు. లంబాడీలు తీజ్ పండుగ ఘనంగా జరుపుకుంటారని.. కానీ ఇప్పుడు బతుకమ్మను ఘనంగా జరుపుకుంటున్నారని తెలిపారు. పేద, గొప్ప, కులాలకు అతీతంగా బతుకమ్మ పండుగ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవాలక్ష్మి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ మంత్రి సత్యవతి, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ తదితరులు పాల్గొన్నారు.

# మేడారం జాతరకు మాస్టర్ ప్లాన్ ఖరారు: మంత్రులు పొంగులేటి, సీతక్క, అడ్లూరి

హైదరాబాద్: మేడారం జాతరకు సంబంధించిన మాస్టర్ ప్లాన్ ఖరారు చేసినట్టు మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. ఆదివాసీ గిరిజన సంస్కృతీ సంప్రదాయాలకు అనుగుణంగా సమ్మక్క సారలమ్మ గద్దెల ఆధునికీకరణ, భక్తులకు సౌకర్యాలు వంటి అంశాలతో మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసినట్టు మంత్రులు వెల్లడించారు. మాస్టర్‌ప్లాన్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ఆమోదించగానే అభివృద్ధి పనులు ప్రారంభించి వందరోజుల్లో పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. అభివృద్ధి పనులకు త్వరలో సీఎం శంకుస్థాపన చేస్తారని వెల్లడించారు. మేడారం మాస్టర్ ప్లాన్‌పై మంత్రులు పొంగులేటి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ సమీక్ష నిర్వహించారు. గద్దెల అభివృద్ధి, సమ్మక్క, సారలమ్మ ప్రధాన ద్వారం, ప్రహరీగోడ నిర్మాణ డిజైన్లపై చర్చించారు. అభివృద్ధి పనులకు సంబంధించిన కార్యచరణ ప్రణాళికను రెండు రోజుల్లో సమర్పించాలని మాస్టర్‌ప్లాన్ తయారు చేసిన కన్సల్టెన్సీని మంత్రులు ఆదేశించారు. అధికారులు, కన్సల్టెన్సీ ప్రతినిధులు మేడారం వెళ్లి పూజారులు, స్థానిక ప్రజల అభిప్రాయాలను తీసుకొని గద్దెల డిజైన్ తయారు చేసినట్లు మంత్రులు చెప్పారు. గతంలో



పగిడిద్దరాజు, గోవిందరాజుల దర్శనం సరిగా జరగక.. భక్తులు ఇబ్బందిపడ్డారన్న మంత్రులు.. ఆ సమస్య పరిష్కారానికి గద్దెల ప్రాంగణాన్ని విస్తరిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచంలోనే అతి పెద్ద గిరిజన పండుగగా ప్రసిద్ధి చెందిన ఈ జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమ్మక్క సారలమ్మల త్యాగం, ఔన్నత్యం మరింత చాటి చెప్పేలా ఆలయ ప్రాంగణం రూపకల్పన జరుగుతోందని తెలిపారు. మేడారం ఆలయంతో పాటు పరిసర ప్రాంతాల్లోని అన్ని దేవాలయాలను శోభాయమానంగా తీర్చిదిద్దుతామని మంత్రి పొంగులేటి తెలిపారు. సమావేశంలో సీఎం ముఖ్యకార్యదర్శి శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## అమెరికాలో
# మహబూబ్‌నగర్ వాసి మృతి

మహబూబ్‌నగర్: అమెరికాలో మహబూబ్‌నగర్ వాసి ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయాడు. ఇద్దరు స్నేహితుల మధ్య గొడవ చల్లారక పోవడంతో పోలీసులు కాల్పులు జరపగా.. అక్కడే ఉన్న అమెరుద్దీన్‌కు బుల్లెట్ తగిలి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. మహబూబ్‌నగర్ పట్టణానికి చెందిన అమెరుద్దీన్ 2016లో అమెరికా వెళ్లాడు. అక్కడి యూనివర్సిటీ ఆఫ్ ఫ్లోరిడాలో ఎంఎస్ పూర్తి చేసి.. ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆరు నెలల క్రితం జాబ్ ఒప్పందం ముగియడంతో.. ఎక్స్‌టెన్షన్ లేక తన స్నేహితులతో కలిసి ఓ రూమ్‌లో ఉంటున్నాడు. ఈ క్రమంలో ఇద్దరు స్నేహితుల మధ్య గొడవ జరిగింది. వారిలో ఒకరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చినా గొడవ ఆగకపోవడంతో వారు కాల్పులు జరిపారు. దీంతో ప్రమాదవశాత్తు ఆ తూటా వెళ్లి అమెరుద్దీన్‌కు తగిలి ప్రాణాలు కోల్పోయాడు. వెంటనే అక్కడి స్నేహితులు ఈ విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేశారు. చికాగోలో ఉంటున్న మృతుడి మామయ్య ఘటనా స్థలికి వెళ్లారు. 8 రోజుల క్రితం ఊర్లోని తన తల్లిదండ్రులతో అమెరుద్దీన్



మాట్లాడినట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే, ఈ ఘటన ఎప్పుడు జరిగిందన్నదానిపై స్పష్టమైన సమాచారం లేదు.

# హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను కాపాడుకోవాలి

హైదరాబాద్: నగరంలో నిధుల కొరత ఉన్నప్పటికీ.. లభ్యమవుతున్న నిధులను సమర్థవంతంగా వినియోగించి అభివృద్ధి చేయాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సూచించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ, కేంద్ర సహాయ పథకాలు, ప్రాజెక్టుల అమలు స్థితిపై గురువారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ''హైదరాబాద్ అంటే కేవలం జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, హైటెక్ సిటీ మాత్రమే కాదు.. నిజమైన హైదరాబాద్ బస్తీల్లో ఉంది. నగరంలో చిన్నపాటి వర్షం కురిసినా రహదారులు జలమయమై ఇబ్బందులు ఎదురవుతున్నాయి.



ఇటీవల వర్షాల కారణంగా నాంపల్లిలో ఇద్దరు, సంతోష్‌నగర్‌లో ఒకరు నాలాలో కొట్టుకుపోవడం దురదృష్టకరం. ఎంపీలు, ఎమ్మెల్యేలతో పాటు అన్ని శాఖల అధికారులు కలిసికట్టుగా పనిచేసి.. నగర ప్రాధాన్యతను గుర్తుంచుకొని, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను కాపాడుకోవాలి. ఏ బస్తీకి వెళ్లినా వర్షపు నీరు, వరదలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అనేక ప్రాంతాల్లో డ్రైనేజీ సిస్టం దెబ్బతిని.. తాగునీటిలో కలిసిపోతోంది. అన్నీ రిస్టోర్ చేసి శుభ్రం చేయాలి. స్కూల్స్, కమ్యూనిటీ హాళ్లు, అంగన్వాడీ కేంద్రాలు, హాస్టల్స్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలు పరిష్కరించుకోవాలి'' అని కిషన్‌రెడ్డి అన్నారు.

# దిల్లీ పబ్లిక్ స్కూల్ ఘటన.. నాచారం సీఐపై బదిలీ వేటు

నాచారం (హైదరాబాద్): దిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థిపై దాడి ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న ఆరోపణలపై నాచారం సీఐపై ప్రభుత్వం బదిలీ వేటు వేసింది. పుట్టిన రోజున.. బర్త్‌డే బంప్స్ పేరిట తోటి విద్యార్థులు చేసిన వికృత చేష్టలతో ఓ బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. కొత్తపేటకు చెందిన విద్యార్థి(14) నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. ఆగస్టు 29న పుట్టినరోజు కావడంతో.. తోటి విద్యార్థులు మధ్యాహ్నం విరామ సమయంలో సరదాగా చేసిన చేష్టలతో ఆ విద్యార్థి మర్మంగానికి గాయమై రక్తస్రావమైంది. పిడిగుద్దుల ధాటికి రక్తం కారుతున్నా.. తోటి విద్యార్థులు వదల్లేదు. విషయం తెలిసి ప్రిన్సిపల్ ఆ విద్యార్థిని ఆసుపత్రికి తరలించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు.




తల్లిదండ్రులు మెరుగైన వైద్యం కోసం బంజారాహిల్స్‌లోని ఆసుపత్రికి తరలించారు. విద్యార్థికి శస్త్ర చికిత్స చేయడంతో ప్రాణాపాయం తప్పింది. ఘటనపై కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినప్పటికీ బాధ్యులైన విద్యార్థులు, పాఠశాల యాజమాన్యంపై కేసు నమోదు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని నాచారం సీఐని బదిలీ చేస్తూ డీజీపీ ఆదేశాలు జారీ చేశారు.




## తెలంగాణలోని పలు జిల్లాలకు
# ఎల్లో హెచ్చరికలు జారీ...

హైదరాబాద్: ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాష్ట్రంలోని పలు జిల్లాలకు ఇవాళ కూడా వర్ష సూచన ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట, వికారాబాద్, సూర్యాపేట, నాగర్ కర్నూల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపిన వాతావరణశాఖ.. ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది.

## ఆ వదంతులు నమ్మొద్దు..
# ఏదైనా ఉంటే నేనే చెబుతా: కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

చిట్యాల: కొందరు గిట్టని వ్యక్తులు తన ప్రతిష్ఠ దెబ్బతీసేందుకు, సామాజిక మాధ్యమాల ద్వారా అవాస్తవాలు వ్యాపింపజేస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వదంతులను నమ్మొద్దని పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. గుంటూరులో ఓ కార్యక్రమానికి వెళ్తూ.. చిట్యాల మండలం పెద్దకాపర్తిలో కార్యకర్తలతో కలిసి ఆయన భోజనం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రాజీనామా చేస్తున్నానని, పార్టీ మారుతున్నానని, పార్టీ పెడుతున్నానని ఇలా రకరకాల వార్తలు



సృష్టిస్తున్నారు. '' కాంగ్రెస్ పార్టీ శ్రేయస్సు దృష్ట్యా, పార్టీని బలోపేతం చేసేందుకు కొన్ని సందర్భాల్లో నా అభిప్రాయాన్ని బహిరంగంగా చెప్పాను. అలా చెప్తే తప్పేంటి?ఇవాళ కూడా ఓ ప్రైవేటు కార్యక్రమానికి గుంటూరు వెళ్తుంటే.. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలవడానికి వెళ్తున్నానని వదంతులు సృష్టిస్తున్నారు. నా రాజకీయ భవిష్యత్ గురించి మీడియా సమావేశం పెట్టి చెబుతా, అప్పటి వరకు ఈ దుష్ప్రచారాలు నమ్మొద్దని తెలంగాణ సమాజాన్ని కోరుతున్నా'' అని రాజగోపాల్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# ఐటీబీపీ జవాన్ల త్యాగం సజీవం: కేంద్రమంత్రి బండి సంజయ్

నిత్యం దేశ సేవ చేస్తున్న ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ జవాన్ల ధైర్య సాహసాలు మరువలేమని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. దేశం కోసం ఐటీబీపీ జవానుల ధైర్యం, చేస్తున్న త్యాగాలు భారతీయుల హృదయాలలో ఎప్పటికీ సజీవంగా నిలిచిపోతాయన్నారు. దేశాన్ని కంటికి రెప్పలా కాపాడుకునే జవాన్లకు గౌరవ మర్యాదలతోపాటు సౌకర్యాలతో జీవించేలా చేసేందుకు కేంద్రం ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. గురువారం హర్యానాలో ఐటీబీపీ బేసిక్ ట్రైనింగ్ సెంటర్‌లో 9వ నివాస భవన సముదాయాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐటీబీపీ హిమవీరుల వీరత్వాన్ని, అంకితభావాన్ని మాటల్లో చెప్పడం కష్టమని, హిమవీరులు హిమాలయ పర్వతాలలో కఠినమైన పరిస్థితుల్లో సేవ చేస్తూ దేశ భద్రతను కాపాడుతున్నారని కొనియాడారు. ఈ నిబద్ధత, అజేయ ధైర్యంతో భారత ప్రజలు నిశ్చింతగా ఉండగలుగుతున్నారని చెప్పారు.ఆక్సిజన్ కొరత ఉన్న ప్రాంతాల్లో, గడ్డకట్టే చలిలో, కఠినమైన భౌగోళిక పరిస్థితుల్లో దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడుతూ సరిహద్దులను గస్తీ కాస్తున్నారు. లడఖ్ మంచు మార్గాల నుంచి అరుణాచల దట్టమైన అరణ్యాల దాకా వారి శౌర్య, దృఢత, కర్మనిష్ఠ అనే నినాదానికి సజీవ ప్రతిరూపమన్నారు. అనంతరం ఐటిబిపి కానిస్టేబుల్ క్యాడర్ ట్రైనింగ్‌లో వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన కానిస్టేబుల్ ట్రైనింగ్ అభ్యర్థులతో ముచ్చటించారు. తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల నుండి వచ్చిన ఐటిబిపి కానిస్టేబుల్ శిక్షణ అభ్యర్థులతో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారికి అవసరమైన సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. మహిళా అభ్యర్థులు మొబైల్ టాయిలెట్ల అవసరం ఉందని కోరగా, వాటిని తక్షణమే ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ



మహిళా కానిస్టేబుల్ అభ్యర్థులు బతుకమ్మ సందర్భంగా ఈనెల 29, 30 తేదీల్లో బతుకమ్మ సంబరాలు జరుపుకోవడానికి అనుమతి కోరారు. వెంటనే అధికారులను ఆదేశించి, తెలంగాణ బతుకమ్మ పర్వదిన గొప్పతనం, విశిష్టతను వివరించి, అభ్యర్థులకు బతుకమ్మ పండుగను సాంప్రదాయబద్ధంగా జరుపుకునే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు



# తెలంగాణ ప్రజలకు గవర్నర్ కీలక పిలుపు

బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రతీక అని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. గురువారం సంస్కార భారతి తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బతుకమ్మ సంబరాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రతీక అని, ఈ సంబరాలను అందరూ కలిసిమెలిసి జరుపుకోవాలని పిలుపునిచ్చారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉందని ఆయన అన్నారు. ఈ బతుకమ్మ సంబరాలను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. గవర్నర్‌ను కలిసిన వారిలో సంస్కార భారతి తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.కె.వి. శర్మ, రాష్ట్ర కార్యదర్శి భవాని, మాతృశక్తి రాష్ట్ర కన్వీనర్ సుష్మ, కోకన్వీనర్ షాలిని తదితరులు పాల్గొన్నారు. ఈ బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించేందుకు సంస్కార భారతి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రతినిధులు తెలిపారు.

# టీ హబ్ తరహాలోనే బీ హబ్: మంత్రి

రాష్ట్రంలో లైఫ్ సైన్సెస్ రంగంలో అంకుర సంస్థలను ప్రోత్సహించేందుకు టీ హబ్ తరహాలోనే బీ హబ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. గురువారం యూఎంవో ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైటెక్ సిటీలో యూఎక్స్ ఇండియా ఏర్పాటు చేసిన 21వ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ యూజర్ ఎక్స్పీరియన్స్, ప్రొడక్ట్ డిజైన్‌ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైదరాబాద్‌ను కేవలం టెక్నాలజీ హబ్ గానే కాకుండా గ్లోబల్ డిజైన్ హబ్‌గా మార్చేందుకు తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తుందన్నారు. త్వరలోనే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ డిజైన్‌ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేయబోతున్న ఏఐ ఇన్నోవేషన్ హబ్‌లో డిజైనింగ్‌కు పెద్దపీట వేస్తున్నామన్నారు. డిజైనింగ్ అంటేనే సృజనాత్మకత అని, అది యూజర్ ఫ్రెండ్లీగా ఉంటే ఆ యాప్, వెబ్ సైట్ మనుగడ సాధ్యమన్నారు.

# సాఫ్ట్‌వేర్‌తో 'ఓటు' తొలగింపు సాధ్యమా..? నిబంధనలు ఏం చెబుతున్నాయి?

సాఫ్ట్‌వేర్ సాయంతో అనేక మంది కాంగ్రెస్ మద్దతుదారుల ఓట్లను తొలగించారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించిన విషయం తెలిసిందే. కర్ణాటకలో కేవలం ఒక్క అలంద్ నియోజకవర్గంలోనే వేలాది ఓట్లను తొలగించారని ఆరోపించారు. అయితే, ఈ ఆరోపణలను తోసిపుచ్చిన ఈసీ ఆన్‌లైన్‌లో ఏ ఒక్క ఓటును తొలగించలేరని స్పష్టం చేసింది. సంబంధిత వ్యక్తికి సమాచారం లేకుండా ఓటు తీసివేయడం కుదరదని పేర్కొంది. ఈ నేపథ్యంలో అసలు ఓటు తొలగింపు ప్రక్రియ ఎలా ఉంటుందని విషయం పరిశీలిస్తే.. ఓటరు జాబితా నుంచి పేరు తొలగించాలన్నా లేదా జాబితాలో ఎవరిపైనా అభ్యంతరం ఉన్నా.. ఫారం 7తో ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్‌కు దరఖాస్తు చేసుకోవాలి. ఎవరైనా ఓటరు తన నియోజకవర్గం మారినా ఇదే ఫారంతో దరఖాస్తు చేసుకోవాలి. నియోజకవర్గం పేరు, ఎపిక్ నంబరు, తొలగింపునకు కారణాన్ని తెలియజేయడంతోపాటు దరఖాస్తుదారుని వివరాలు, సంతకం కూడా అవసరం. ఆన్‌లైన్‌లో లేదా బూత్ లెవల్ ఆఫీసర్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు.



### క్షేత్రస్థాయిలో పరిశీలన..

ఇలా వచ్చిన దరఖాస్తులను ఈఆర్‌ఓ క్షుణ్ణంగా పరిశీలించి.. ఓటరుకు వ్యక్తిగతంగా, రిజిస్టరు పోస్టు ద్వారా తెలియజేస్తారు. ఒక్కోసారి ఓటరు ఇంటికి నోటీసులు అంటిస్తారు. ఓటరు ఆ అడ్రస్‌లోనే ఉన్నాడా? లేదా మరణించాడా? నకిలీ నమోదా? అన్న విషయాన్ని బీఎల్‌ఓ క్షేత్రస్థాయికి వెళ్లి ధ్రువీకరించుకొని ఈఆర్‌ఓకు నివేదిస్తారు. తొలగింపు కోసం ఇతరులు దరఖాస్తు చేస్తే.. వారితోపాటు ఓటరు అభిప్రాయాన్నీ తీసుకుంటారు. సంబంధిత దస్త్రాలు, వ్యక్తిగతంగా హాజరుకావడం, స్టేట్‌మెంట్ రికార్డు వంటి ప్రక్రియ తర్వాత పేరును తొలగింపు లేదా దరఖాస్తు తిరస్కరణపై నిర్ణయం తీసుకుంటారు. దీనిపై దరఖాస్తుదారు అప్పీలు చేసుకునే అవకాశం కూడా ఉంటుంది. ఒక నియోజకవర్గం నుంచి మరో నియోజకవర్గం మారినప్పుడు, సంబంధిత అడ్రస్‌లో నివసించనప్పుడు, జాబితాలో రెండుసార్లు ఉన్నప్పుడు, వ్యక్తి చనిపోవడం లేదా భారత పౌరుడు కాని పక్షంలో మాత్రమే ఓటరును తొలగించే అవకాశం ఉంటుంది.

### ఎవరైనా దరఖాస్తు చేయవచ్చా?

తమ నియోజకవర్గంలో ఉన్న ఓటరు పేరు తొలగించాలని ఎవరైనా దరఖాస్తు (ఫారం 7) చేయవచ్చు. అయితే, దరఖాస్తు చేసినంత మాత్రానా ఓటు తొలగిపోదు. ఓటరుకు నోటీసు ఇవ్వడం, క్షేత్రస్థాయి దర్యాప్తు తర్వాతే ఈఆర్‌ఓ నిర్ణయం తీసుకుంటారు. ఓటరు పేరును నేరుగా తొలగించడం చట్టవిరుద్ధం. తప్పుడు దరఖాస్తు చేసినా చట్టప్రకారం నేరమే.

### సాఫ్ట్‌వేర్‌తో తొలగించవచ్చా..?

ఓటరు జాబితాలో పేర్ల తొలగింపు కోసం ఫేక్ మొబైల్ నంబర్లు, ఓటీపీల ద్వారా దరఖాస్తు చేసినట్లు రాహుల్ గాంధీ ఆరోపిస్తున్నారు. అయితే, ఆన్‌లైన్‌లో కేవలం దరఖాస్తుకు మాత్రమే అవకాశం ఉంది. నేరుగా పేర్లను తొలగించడం కుదరదు. ప్రతి దరఖాస్తులో అంశాలు ధ్రువీకరించుకున్న తర్వాతే చర్య ఉంటుంది. భారీ సంఖ్యలో దరఖాస్తులు వచ్చినా అన్నింటికీ ఇదే ప్రక్రియ కొనసాగించాల్సి ఉంటుంది. సాఫ్ట్‌వేర్ ద్వారా తొలగించడం కుదరదని ఎన్నికల సంఘం కూడా స్పష్టం చేసింది.



## 30 ఏళ్ల క్రితం అదృశ్యం..
# ఎట్టకేలకు హత్యకేసు నమోదు

ఓ యువకుడు 30ఏళ్ల క్రితం అదృశ్యం కాగా.. బాధిత కుటుంబం సుదీర్ఘ న్యాయ పోరాటంతో ఎట్టకేలకు అతడి హత్య కేసు నమోదైంది. ఉత్తర్‌ప్రదేశ్‌లో ఈ వ్యవహారం వెలుగుచూసింది. జాలౌన్ జిల్లాకు చెందిన ప్రదీప్ కుమార్ బాజ్‌పేయి 1995లో 22 ఏళ్ల వయసులో అదృశ్యమయ్యాడు. తన కుమారుడిని సమీప బంధువులే హత్య చేశారంటూ అతడి తండ్రి ఉమాశంకర్ స్థానిక కోట్రా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే, ఆ సమయంలో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు. దీంతో జిల్లా కోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేయాలంటూ 1998 అక్టోబరులో పోలీసులను న్యాయస్థానం ఆదేశించింది. అయినప్పటికీ.. పోలీసులు పట్టించుకోలేదు. వెనక్కి తగ్గని ఉమాశంకర్.. హైకోర్టుకు వెళ్లారు. దీంతో ఎఫ్ఐఆర్ నమోదయ్యేలా చూడాలని ఈ ఏడాది జూన్‌లో జిల్లా కోర్టును హైకోర్టు ఆదేశించింది. అప్పటికే ఉమాశంకర్ మృతి చెందారు. ఫిర్యాదు సంబంధిత పత్రాలు కూడా మాయం కావడం గమనార్హం. ఆయన సోదరుడు దేవేంద్ర న్యాయపోరాటాన్ని కొనసాగించారు. హైకోర్టు ఆదేశానికి అనుగుణంగా జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు సూచనల మేరకు.. ఎట్టకేలకు ఇటీవల కోట్రా పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టి.. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఎస్పీ దుర్గేశ్ కుమార్ తెలిపారు. ఫిర్యాదు ఫైల్ ఎలా అదృశ్యమైందనే దానిపైనా దర్యాప్తునకు కూడా కోర్టు ఆదేశించిందని చెప్పారు.

## విపక్షాలకు అవకాశమిస్తే..
# చొరబాటుదారులతో బిహార్ నిండిపోతుంది

ఓట్ల చోరీ అంటూ 'ఇండియా' కూటమి తప్పుడు ఆరోపణలు చేస్తోందని కేంద్ర మంత్రి అమిత్ షా విమర్శించారు. భాజపా అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను తొలగిస్తుందని గతంలో ఇదే తరహా దుష్ప్రచారం చేసిందన్నారు. బిహార్‌లోని డెహరీ ఆన్ సోన్‌లో పార్టీ శ్రేణులతో సమావేశమైన సందర్భంగా ఆయన ఈ మేరకు మాట్లాడారు. బంగ్లాదేశీ చొరబాటుదారులను రక్షించడమే లక్ష్యంగా రాష్ట్రంలో ఇటీవల రాహుల్ గాంధీ యాత్ర నిర్వహించారని ఆరోపించారు. ఒకవేళ ప్రతిపక్ష కూటమి అధికారంలోకి వస్తే.. రాష్ట్రమంతా చొరబాటుదారులతో నిండిపోతుందని వ్యాఖ్యానించారు. ''బంగ్లాదేశ్ నుంచి వచ్చిన చొరబాటుదారులను రక్షించడమే రాహుల్ గాంధీ 'ఓటర్ అధికార్ యాత్ర' ప్రధాన ఉద్దేశం. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికీ తిరుగుతూ.. 'ఇండియా' కూటమి అధికారంలోకి వస్తే బిహార్ చొరబాటుదారులతో నిండిపోతుందని చెప్పండి. అదేవిధంగా 'ఓట్ల చోరీ' అంటూ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టండి. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను రద్దు చేయడానికి భాజపా యత్నిస్తుందని గతంలో ఇదే తరహా ఆరోపణలు చేశారు. కానీ.. అలాంటిదేమీ జరగలేదు కదా'' అని కాషాయ శ్రేణులను ఉద్దేశించి అమిత్ షా పేర్కొన్నారు. బిహార్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించేందుకు అమిత్ షా ఈ పర్యటన చేపట్టారు. మగధశాహాబాద్ ప్రాంతంలోని 10 జిల్లాల నేతలతో సమావేశమయ్యారు. 2020 అసెంబ్లీ ఎన్నికలు, గత ఏడాది లోక్‌సభ ఎన్నికల్లో ఇక్కడ ఎన్డీయే పనితీరు అంతంతమాత్రంగానే ఉండటంతో ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం. అంతకుముందు సీఎం నీతీశ్ కుమార్ పాట్నాలో అమిత్ షాను కలిశారు. తాను ఎన్డీయేలోనే ఉంటానని ఇటీవల ప్రధాని మోదీ సమక్షంలో నీతీశ్ స్పష్టం చేసిన విషయం తెలిసిందే.



# నేపాల్‌లో శాంతి స్థాపనకు అండగా ఉంటాం

### : సుశీలా కార్కీకి మోదీ హామీ

సోషల్ మీడియాపై నిషేధం, అవినీతి వ్యతిరేక నిరసనలతో కొన్ని రోజుల క్రితం అట్టుడికిన నేపాల్‌లో పరిస్థితులు కుదుటపడ్డాయి. ఈ క్రమంలో ఆ దేశంలో శాంతి స్థాపనకు భారత్ అండగా ఉంటుందని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. తాత్కాలిక ప్రభుత్వ ప్రధానిగా ఇటీవల బాధ్యతలు తీసుకున్న మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుశీలా కార్కీతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. ఈ సంభాషణకు సంబంధించిన విషయాలను మోదీ ఎక్స్‌లో పంచుకున్నారు. సుశీలా కార్కీతో అద్భుతమైన సంభాషణ జరిగిందని పేర్కొన్నారు. నిరసనల్లో



ప్రాణాలు కోల్పోయినవారికి సంతాపం వ్యక్తం చేసినట్లు తెలిపారు. శాంతి, స్థిరత్వం పునరుద్ధరణకు ఆమె చేసే ప్రయత్నాలకు భారత మద్దతును పునరుద్ఘాటించినట్లు మోదీ వెల్లడించారు. సామాజిక మాధ్యమాల నిషేధంతో మొదలై.. అవినీతికి వ్యతిరేక ఉద్యమంగా మారిన నేపాల్ ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. దీంతో ప్రధాని కేపీ శర్మ సహా పలువురు మంత్రులు తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ క్రమంలోనే సుశీలా కార్కీని తాత్కాలిక ప్రధానిగా జెన్‌జీ ఎంపిక చేసింది. గత శుక్రవారం ఆమె ప్రధానిగా ప్రమాణస్వీకారం చేశారు. కార్కీ సిఫార్సు మేరకు దేశ అధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ పార్లమెంటును రద్దు చేశారు. 2026 మార్చి 5న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు.

## అత్యాచారం కేసు..
# లలిత్ మోదీ సోదరుడి అరెస్టు

లలిత్ మోదీ సోదరుడు, వ్యాపారవేత్త సమీర్ మోదీని దిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. అత్యాచారం కేసులో అతడిని అరెస్టు చేసినట్లు సమాచారం. విదేశాలకు వెళ్తున్న సమయంలో దిల్లీ ఎయిర్‌పోర్టులో అతడిని కస్టడీలోకి తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. గతంలో సమీర్‌తో సహజీవనం చేసిన మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదైనట్లు సంబంధిత వర్గాల సమాచారం. సౌత్ ఈస్ట్ దిల్లీలోని న్యూ ఫ్రెండ్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌లో సమీర్ మోదీపై కేసు నమోదైంది. అరెస్టు తర్వాత కోర్టు ముందు హాజరుపరచగా.. సమీర్‌కు ఒకరోజు జ్యుడిషియల్ కస్టడీ విధించినట్లు తెలిసింది. సెప్టెంబర్ 19న మరోసారి కోర్టు ముందు హాజరు పరచనున్నారు. ఈ కేసును సెటిల్ చేసుకునేందుకు సదరు మహిళ రూ.50 కోట్లు డిమాండ్ చేసినట్లు సమాచారం. అయితే, ఈ వ్యవహారంపై దిల్లీ పోలీసుల



నుంచి అధికారికంగా ఎటువంటి ప్రకటన వెలువడలేదు. మరోవైపు ఐపీఎల్‌కు బాస్‌గా ఉన్న సమయంలో కోట్లాది రూపాయలు దుర్వినియోగం చేశాడని లలిత్ మోదీ ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. దీంతో 2010లో లండన్‌కు పారిపోయిన అతడు.. అప్పటి నుంచి అక్కడే ఉంటున్నాడు. తిరిగి స్వదేశానికి రప్పించేందుకు భారత్ ప్రయత్నాలు చేస్తున్న సంగతి తెలిసిందే.

## శబరిమల విగ్రహాలపై 4.5 కిలోల బంగారం ఏమైంది..?
# దర్యాప్తునకు కోర్టు ఆదేశం

కోచి: కేరళలోని ప్రసిద్ధ శబరిమల ఆలయంలో విగ్రహాల బంగారు పూతపూసిన తాపడాలను అనుమతి లేకుండా తొలగించడం ఇటీవల వివాదాస్పదమైంది. తాజాగా ఇందుకు సంబంధించిన మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. ఈ విగ్రహాల తాపడాలపై బంగారం బరువు తగ్గడాన్ని కేరళ హైకోర్టు తీవ్రంగా పరిగణించింది. దీనిపై విజిలెన్స్ కమిటీ దర్యాప్తు చేపట్టాలని న్యాయస్థానం ఆదేశించింది. అసలేం జరిగిందంటే.. శబరిమలలో గర్భగుడి ముందు ఉన్న ద్వారపాలక విగ్రహాలపై బంగారు పూతపూసిన రాగి తాపడాలను 2019లో మరమ్మతుల నిమిత్తం తొలగించారు. వాటిని సరి చేయించి కొత్త బంగారు పూత తాపడాలను అందిస్తానని ఉన్నికృష్ణన్ అనే దాత తీసుకెళ్లారు. ఈ పనిని చెన్నైలోని ఓ సంస్థకు అప్పగించారు. 2019లో వాటిని తొలగించే సమయంలో తాపడాల బరువు 42.8 కిలోలుగా ఉన్నట్లు రికార్డుల్లో ఉంది. అయితే, ఆ తాపడాలను తమ వద్దకు తెచ్చినప్పుడు బరువు 38.28 కిలోలు మాత్రమే ఉందని సదరు కంపెనీ తెలిపింది. అంతేగాక, ఆలయం నుంచి తాపడాలను తొలగించిన దాదాపు 40 రోజుల తర్వాత వాటిని చెన్నైలోని కంపెనీకి అందించినట్లు తెలిసింది.



### ఆ భూమిని తిరిగి ఇచ్చేయండి

ఈ పరిణామాలపై తాజాగా కోర్టు అనుమానం వ్యక్తం చేసింది. ఉన్నట్టుండి తాపడాల బరువు 4.524కేజీలు తగ్గడాన్ని తీవ్రంగా పరిగణించింది. వీటిని తిరిగి అమర్చినప్పుడు ఎందుకు బరువును సరిచూడలేదని ప్రశ్నించింది. ఈ తగ్గుదలకు ఏకైక కారణంగా బంగారు పూత తగ్గడమే అని న్యాయస్థానం అభిప్రాయపడింది. లేదంటే దాత వాటి స్థానంలో మరో తాపడాల సెట్‌ను కంపెనీకి ఇచ్చే అవకాశం కూడా ఉన్నట్లు పేర్కొంది. ఇందులో అనేక లోపాలు కనిపిస్తున్నాయని, బరువు ఎలా తగ్గిందో తెలుసుకునేందుకు విజిలెన్స్ కమిటీ దర్యాప్తునకు ఆదేశించింది. ఇందుకు సహకరించాలని ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డుకు సూచించింది. దీనిపై మూడు వారాల్లోగా పూర్తి నివేదికను అందజేయాలని స్పష్టం చేసింది. అనంతరం ఈ కేసు విచారణను సెప్టెంబరు 30వ తేదీకి వాయిదా వేసింది. శబరిమల స్పెషల్ కమిషనర్‌కు సమాచారం ఇవ్వకుండానే ద్వారపాలక విగ్రహాల బంగారు తాపడాలను మరమ్మతుల నిమిత్తం తొలగించడంపై హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఇటీవల దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ముందస్తు అనుమతులు లేకుండా వాటిని ఎలా తరలిస్తారని ప్రశ్నించింది. దీనిపై బోర్డు నుంచి వివరణ కోరింది.

## బంధుప్రీతి లేని ఏకైక ప్రదేశం 'సైన్యం' సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్



బంధుప్రీతి లేని ఏకైక ప్రదేశం సైన్యమేనని సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ పేర్కొన్నారు. రాంచీలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ.. దేశసేవ చేయాలంటే సైన్యంలో చేరాలన్న లక్ష్యం పెట్టుకోవాలని చిన్నారులకు సూచించారు. ఈ సందర్భంగా ఈ ఏడాది ప్రకృతి విపత్తు ఘటనల్లో అనేక మంది పౌరులను రక్షించేందుకు సైన్యం కృషి చేసిందన్నారు. ''బంధుప్రీతి లేని ఏకైక ప్రదేశం సైన్యం. దేశసేవ చేయాలనుకుంటే, దేశంతోపాటు ప్రపంచాన్ని అన్వేషించాలనుకుంటే త్రివిధ దళాల్లో చేరడం లక్ష్యంగా పెట్టుకోవాలి. ఇక్కడ కష్టపడితే గుర్తింపు తప్పకుండా వస్తుంది'' అని జనరల్ అనిల్ చౌహాన్ పేర్కొన్నారు. చిన్నారులతో ముచ్చటించిన ఆయన.. ఈ ఏడాది ప్రకృతి విలయ సంఘటనలు అధికంగా చోటుచేసుకున్న నేపథ్యంలో రెస్క్యూ ఆపరేషన్లలో అనేక మందిని రక్షించేందుకు సాయుధ దళాలు తీవ్ర కృషి చేశాయన్నారు. ఆపరేషన్ సిందూర్ గురించి సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ మాట్లాడుతూ.. మే 7న అర్ధరాత్రి శత్రు స్థావరాలపై దాడులు చేశామని, ఒంటి గంటకు తొలి దాడి జరిగిందని చెప్పారు. సుదీర్ఘ లక్ష్యాలపై రాత్రి వేళల్లో దాడులు చేయాలంటే ప్రత్యేక కృషి అవసరమన్నారు.

## సాఫ్ట్‌వేర్‌ను వాడి.. ఓటర్ ఐడీలను తొలగిస్తున్నారు: రాహుల్ గాంధీ ఆరోపణలు

కేంద్ర ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర ఆరోపణలు చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీకి పట్టున్న ప్రాంతాల నుంచి ఓట్లను తొలగించారని విమర్శించారు. రాష్ట్రం వెలుపలి నుంచి నకిలీ లాగిన్లు, ఫోన్ నంబర్లను ఉపయోగించి ఓటర్ ఐడీలను తొలగించినట్లు వ్యాఖ్యానించారు. సాఫ్ట్‌వేర్‌ను వినియోగించి కేంద్రీకృత పద్ధతిలో ఈ చర్యలకు పాల్పడినట్లు ఆరోపించారు. ఈ మేరకు దిల్లీలో మీడియా సమావేశం నిర్వహించారు. ''ఈ ఓట్ల తొలగింపు అంతా వ్యక్తులతో గాకుండా సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి చేస్తున్నారు. అదంతా ఒక ప్రక్రియ ప్రకారం జరుగుతోంది. ప్రతిపక్షాలకు ఓట్లు వేసే కమ్యూనిటీలను మరీ ముఖ్యంగా లక్ష్యంగా చేసుకుంటున్నారు. దీనికి సంబంధించి మేం 100 శాతం ఆధారాలను గుర్తించాం. నేను ఈ దేశాన్ని, రాజ్యాంగాన్ని ప్రేమిస్తున్నాను. ఈ ప్రజాస్వామ్య ప్రక్రియను ఇష్టపడతాను. ఈ ప్రక్రియను నేను రక్షిస్తున్నాను. ఇక దీనికి ఎలా స్పందించాలనేది మీ చేతుల్లోనే ఉంటుంది. కర్ణాటకలోని అలంద్‌లో ఆరువేల ఓట్లను తొలగించే ప్రయత్నం జరిగింది'' అని విమర్శించారు.

# అమెరికా ఫెడ్ వడ్డీ రేట్ల కోత..

**లాభాల హ్యాట్రిక్ కొట్టిన స్టాక్ మార్కెట్లు**

**వరుసగా మూడో రోజు లాభాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు**

**అమెరికా ఫెడ్ వడ్డీ రేట్లను తగ్గించడంతో వెల్లువెత్తిన కొనుగోళ్లు**

**భారీగా లాభపడిన ఐటీ షేర్లు, మార్కెట్లకు ప్రధాన మద్దతు**

**320 పాయింట్ల లాభంతో 83,013 వద్ద ముగిసిన సెన్సెక్స్**

**93 పాయింట్లు పెరిగి 25,423 వద్ద స్థిరపడిన నిఫ్టీ**

**మార్కెట్లు లాభపడినా డాలర్‌తో పోలిస్తే బలహీనపడిన రూపాయి**



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో సెషన్‌లో కూడా లాభాల జోరును కొనసాగించాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించడంతో అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న సానుకూల సంకేతాలు దేశీయ సూచీలపై ప్రభావం చూపాయి. ముఖ్యంగా ఐటీ షేర్లలో భారీ కొనుగోళ్లు జరగడంతో మార్కెట్లు లాభాలతో ముగిశాయి. గురువారం ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈ సెన్సెక్స్ 320.25 పాయింట్ల లాభంతో 83,013.96 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 93.35 పాయింట్లు పెరిగి 25,423.60 వద్ద ముగిసింది.

అమెరికా ఫెడ్ వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్లు తగ్గించి 4%-%4.25 శాతానికి పరిమితం చేసింది. అంతేకాకుండా, ఉద్యోగ మార్కెట్లో నష్టాలను తగ్గించేందుకు ఈ ఏడాది మరో రెండుసార్లు రేట్లను తగ్గించే అవకాశం ఉందని సంకేతాలిచ్చింది. ఈ సానుకూల పరిణామంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడ్ అయ్యాయని, దాని ప్రభావంతోనే భారత మార్కెట్లు కూడా భారీ లాభాలతో ప్రారంభమయ్యాయని ఆషికా ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్ ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం సెషన్‌లో సూచీలు భారీ గ్యాప్-అప్‌తో ప్రారంభమైనప్పటికీ, ఆ తర్వాత రోజంతా పరిమిత శ్రేణిలోనే కదలాడాయి. రంగాలవారీగా చూస్తే, ఐటీ రంగం సూచీ 0.83 శాతం మేర దూసుకెళ్లింది. దీనితో పాటు నిఫ్టీ బ్యాంక్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఆటో, ఎఫ్ఎంసీజీ వంటి ఇతర కీలక రంగాల సూచీలు కూడా లాభాల్లోనే ముగిశాయి. సెన్సెక్స్ స్టాక్స్‌లో ఇన్ఫోసిస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, సన్ ఫార్మా, పవర్‌గ్రిడ్, హెచ్‌సీఎల్ టెక్, ఐటీసీ వంటి షేర్లు లాభపడగా, బజాజ్ ఫైనాన్స్, టాటా మోటార్స్, ఏషియన్ పెయింట్స్ వంటివి నష్టపోయాయి. బ్రాడర్ మార్కెట్లలోనూ కొనుగోళ్ల మద్దతు కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 0.38 శాతం, స్మాల్‌క్యాప్ 100 సూచీ 0.29 శాతం చొప్పున పెరిగాయి. అయితే, స్టాక్ మార్కెట్లు లాభపడినా, డాలర్‌తో రూపాయి మారకం విలువ బలహీనపడింది. ఫెడ్ వడ్డీ రేట్లను తగ్గించినప్పటికీ, భవిష్యత్ కోతలపై స్పష్టమైన మార్గనిర్దేశం లేకపోవడంతో డాలర్ ఇండెక్స్ బలహీనంగానే ఉందని, దీనికి తోడు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల సెంటిమెంట్ అప్రమత్తంగా ఉండటంతో రూపాయి పతనమైందని ఎల్‌కేపీ సెక్యూరిటీస్‌కు చెందిన జతిన్ త్రివేది తెలిపారు. ట్రేడింగ్ ముగిసేసరికి రూపాయి 26 పైసలు నష్టపోయి 88.09 వద్ద స్థిరపడింది.

## క్రెడిట్ కార్డు యూజర్లకు షాక్..

**ఆ యాప్స్‌లో ఇక రెంట్ పేమెంట్స్ బంద్..!**




**న్యూఢిల్లీ:** క్రెడిట్ కార్డు యూజర్లకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ భారీ షాక్ తగిలింది. భారత్‌లోని ప్రముఖ ఫిన్‌టెక్ కంపెనీలైన ఫోన్‌పే, పేటీఎం, క్రెడ్ సహా పలు యాప్‌లలో క్రెడిట్ కార్డు రెంట్ పేమెంట్స్ సర్వీస్‌ను నిలిపివేశాయి. ఆర్‌బీఐ ఆదేశాల నేపథ్యంలో సర్వీసులను నిలిపివేశాయి. సెప్టెంబర్ 15న ఆర్‌బీఐ జారీ చేసిన పేమెంట్ అగ్రిగేటర్, పేమెంట్ గేట్‌వే మార్గదర్శకాల మేరకు ఆయా కంపెనీలు ఈ నిర్ణయం తీసుకున్నది. ఆయా నిబంధనలు ఆర్‌బీఐ కఠినతరం చేసింది. ఆయా సంస్థలతో నేరుగా సంబంధం లేని సంస్థలకు చెల్లింపులను సులభతరం చేయకూడదంటూ మార్గదర్శకాల్లో ఆర్‌బీఐ ఆదేశాలు జారీ చేసింది. కేవైసీ వెరిఫికేషన్ పూర్తయిన మర్చంట్స్‌కు మాత్రమే చెల్లింపుల ప్రాసెస్ చేయాలని మార్గదర్శకాల్లో పేర్కొంది. రెంట్ పేమెంట్స్ విషయంలో ఎవరూ రిజిస్టర్డ్ వ్యాపారులు కాకపోవడంతో ఆయా కంపెనీలు రెంట్‌పేమెంట్స్‌ను నిలిపివేయాల్సిన పరిస్థితి ఎదురైంది. వాస్తవానికి చాలామంది క్రెడిట్ కార్డు యూజర్లు రెంట్ ఆప్షన్‌తో డబ్బులను ఖాతాలకు మళ్లించి వాడుకునే విషయం తెలిసిందే. దాంతో వారందరికీ ఈ నిర్ణయంతో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది.

వాస్తవానికి ఫిట్‌టెక్ కంపెనీలు అందిస్తున్న రెంట్ సేవలను ఉపయోగించుకొని చాలామంది డబ్బులను బ్యాంకులకు మళ్లిస్తున్నట్లుగా ఇప్పటికే చాలా బ్యాంకులు గుర్తించాయి. ఈ క్రమంలోనే హెచ్‌డీఎఫ్‌సీ జూన్ 26న క్రెడిట్ కార్డ్ కస్టమర్లకు పంపిన ఈ మెయిల్‌లో ఫిన్‌టెక్ యాప్‌ల ద్వారా క్రెడిట్ కార్డులను ఉపయోగించి చేసే అద్దె చెల్లింపులపై ప్రతి లావాదేవీకి రూ.3వేల నుంచి ఒకశాతం వరకు రుసుమును విధించనున్నట్లు తెలిపింది. అంతకుముందు ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీఐ రెంట్ పేమెంట్స్‌పై రివార్డ్ పాయింట్లను నిలిపివేశాయి. మార్చి 2024 నుంచి ఫోన్‌పే, పేటీఎం, మొబిక్విక్, ఫ్రీచార్జ్, అమెజాన్ పే వంటి ఫిన్‌టెక్ కంపెనీలు క్రెడిట్‌కార్డుల ద్వారా అద్దె చెల్లింపుల స్వీకరణను నిలిపివేశాయి. అయితే, కొన్ని వినియోగదారులకు మరిన్ని కేవైసీని చేయడంతో తిరిగి రెంట్ పేమెంట్ చేసే అవకాశం కల్పించాయి. క్రెడిట్ కార్డులను ఉపయోగించి భారీగా అద్దె చెల్లింపులు చేస్తుండడంతో ఆర్‌బీఐ ఈ ఆదేశాలు జారీ చేసింది. ఆర్‌బీఐ ఆదేశాలతో ఇకపై ఆయా యాప్‌లను ఉపయోగించి రెంట్ పేమెంట్స్ అవకాశం ఉండదు. ఈ క్రమంలో క్రెడిట్ కార్డు వినియోగదారులు తీవ్ర ఇబ్బందులుపడే అవకాశం ఉంది. ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సిన పరిస్థితి ఎదురైంది.

## ఎక్కువగా కొనుగోలు చేసే 30 రకాల్లో 11 వస్తువుల రేట్లలో భారీ తగ్గుదల

**సగటు జీఎస్టీ రేటు 11 శాతం నుంచి 9 శాతానికి తగ్గే అవకాశం**




**న్యూఢిల్లీ:** దేశంలో వస్తు సేవల పన్ను (జీఎస్టీ) విధానంలో చేపట్టిన తాజా సంస్కరణల వల్ల సామాన్యులకు భారీ ఊరట లభించనుంది. వినియోగదారులు ఎక్కువగా కొనుగోలు చేసే 30 రకాల వస్తువుల్లో 11 వస్తువులపై పన్ను రేట్లు తగ్గనున్నాయి. దీనివల్ల పాలు, ప్రాసెస్ చేసిన ఆహారం వంటి నిత్యావసరాలతో పాటు వాహనాలు, బ్యూటీ సేవలు చౌకగా మారే అవకాశం ఉందని ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ రేటింగ్స్ గురువారం విడుదల చేసిన ఒక నివేదికలో వెల్లడించింది. ఈ మార్పుల వల్ల ఒక సగటు వినియోగదారుడి నెలవారీ ఖర్చులో మూడో వంతుపై సానుకూల ప్రభావం పడుతుందని అంచనా. ఈ ప్రధాన వస్తువులపై ప్రస్తుతం సగటున 11 శాతంగా ఉన్న జీఎస్టీ కొత్త విధానంలో 9 శాతానికి తగ్గుతుందని క్రిసిల్ లెక్కగట్టింది. ముఖ్యంగా తక్కువ, మధ్య ఆదాయ వర్గాల వారికి ఈ తగ్గింపు ఎంతగానో మేలు చేస్తుందని నివేదిక పేర్కొంది.



# దుబాయ్‌లో టీమిండియాకు 'రింగ్ ఆఫ్ ఫైర్' సవాల్

**క్యాచ్‌లు పట్టడం అంత ఈజీ కాదు..!**

**దుబాయ్ స్టేడియంలోని 'రింగ్ ఆఫ్ ఫైర్' లైట్లపై టీమిండియా ప్రత్యేక దృష్టి**

**బౌండరీ వద్ద హై క్యాచ్‌లు పట్టడం పెద్ద సవాల్ అంటున్న ఫీల్డింగ్ కోచ్**

**రెప్పపాటులో బంతి కనిపించకుండా పోయే ప్రమాదం ఉందని వెల్లడి**

**లైట్లతో పాటు గాల్లో తేమ కూడా ఫీల్డింగ్‌పై ప్రభావం చూపుతోందని వ్యాఖ్య**

**ప్రత్యేక ప్రాక్టీస్‌తో ఆటగాళ్లను సిద్ధం చేస్తున్న ఫీల్డింగ్ కోచ్ టి. దిలీప్**

**దుబాయ్:** ఆసియా కప్‌లో అద్భుత ప్రదర్శనతో దూసుకెళుతున్న భారత జట్టుకు దుబాయ్ అంతర్జాతీయ స్టేడియంలో ఒక కొత్త సవాల్ ఎదురవుతోంది. సాధారణంగా స్టేడియాల్లో ఉండే స్తంభాల లైట్లకు భిన్నంగా, ఇక్కడి స్టేడియం పైకప్పు చుట్టూ గుండ్రంగా అమర్చిన 'రింగ్ ఆఫ్ ఫైర్' ఫ్లడ్‌లైట్లు ఫీల్డర్లకు కఠిన పరీక్ష పెడుతున్నాయి. ఈ ప్రత్యేక లైట్ల వెలుగులో ఫీల్డింగ్ చేయడం, ముఖ్యంగా బౌండరీ లైన్ వద్ద గాల్లోకి లేచిన బంతిని అంచనా వేయడం కష్టంగా మారుతోంది. ఈ సమస్యను అధిగమించేందుకు టీమిండియా ప్రత్యేక ఫీల్డింగ్ డ్రిల్స్ నిర్వహిస్తోంది. ఈ అంశంపై భారత జట్టు ఫీల్డింగ్ కోచ్ టి. దిలీప్ స్పందించాడు. దుబాయ్ స్టేడియంలోని లైట్ల వ్యవస్థ విభిన్నంగా ఉంటుందని, డోమ్ ఆకారంలో ఉన్న పైకప్పుకు అమర్చిన ఈ 'రింగ్ ఆఫ్ ఫైర్' కారణంగా ఫీల్డర్లు ఇబ్బంది పడతారని ఆయన వివరించాడు. "బౌండరీ వద్దకు దూసుకొచ్చే హై క్యాచ్‌ల సమయంలో, బంతి ఆ లైట్ల వెలుగు గుండా ప్రయాణిస్తున్నప్పుడు రెప్పపాటులో కంటికి కనిపించకుండా పోయే ప్రమాదం ఉంది. అలాంటప్పుడు ఆటగాళ్లు కంగారుపడతారు" అని దీలిప్ అన్నాడు. ఈ వివరాలను బీసీసీఐ 'ఎక్స్'లో పోస్ట్ చేసిన ఒక వీడియోలో వెల్లడించాడు.

లైట్ల సమస్యతో పాటు దుబాయ్‌లోని అధిక తేమ కూడా మ్యాచ్ ఫలితాన్ని ప్రభావితం చేస్తుందని దిలీప్ పేర్కొన్నాడు. "వాతావరణంలో తేమ ఎక్కువగా ఉండటం వల్ల బంతి గాల్లో ప్రయాణించే తీరు, కిందకు దిగే వేగం ఇతర ప్రాంతాలతో పోలిస్తే భిన్నంగా ఉంటుంది. దీనివల్ల హై క్యాచ్‌లను అంచనా వేయడం కష్టమవుతుంది" అని తెలిపాడు.

ఈ సవాళ్లను ఎదుర్కొనేందుకు ఆటగాళ్లకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు ఆయన వివరించాడు. "క్షణకాలం బంతి కనిపించకపోయినా కంగారు పడాల్సిన అవసరం లేదని, దాన్ని అందుకోవడానికి ఇంకా సమయం ఉంటుందని ఆటగాళ్లకు అర్థమయ్యేలా వైవిధ్యభరితమైన ప్రాక్టీస్ సెషన్లు నిర్వహిస్తున్నాం. చేతులతో బంతిని పట్టుకోవడంతో పాటు, వేగంగా బంతి వద్దకు చేరుకోవడానికి ఫుట్‌వర్క్ కూడా చాలా ముఖ్యం" అని చెప్పుకొచ్చాడు.

ఇప్పటికే ఆసియా కప్‌లో ఆడిన రెండు మ్యాచ్‌లలోనూ గెలిచిన భారత్, సూపర్ ఫోర్ దశకు అర్హత సాధించిన విషయం తెలిసిందే. రేపు అబుదాబిలో ఒమన్‌తో తమ చివరి గ్రూప్ మ్యాచ్ ఆడనుంది.

# ఐపీఎల్ ఫ్రాంచైజీకి గుడ్ బై..

**మెంటర్‌గా వైదొలిగిన యార్కర్ కింగ్..!**




**న్యూఢిల్లీ:** ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్ ముందు ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. కొందరు ఆటగాళ్లు జట్టు మారేందుకు సిద్ధమవుతుండగా.. కొందరేమో మేము మీతో కొనసాగలేం అంటూ ఫ్రాంచైజీలను వీడుతున్నారు. టీమిండియా పేస్ దిగ్గజం జహీర్ ఖాన్ ఐపీఎల్ జట్టుకు బై బై చెప్పేశాడు. ఏడాది క్రితం లక్నో సూపర్ జెయింట్స్‌కు మెంటార్‌గా నియమితుడైన జహీర్ గురువారం తన బాధ్యతల నుంచి వైదొలిగాడు. ఫ్రాంచైజీ యజమాని సంజీవ్ గొయెంకా, కోచ్ జస్టిన్ లాంగర్‌తో పొసగకే అతడు రాజీనామాకు సిద్ధపడినట్టు సమాచారం.

ఐపీఎల్ 2022 ఎడిషన్‌లో అరంగేట్రం చేసిన లక్నో.. వస్తూ వస్తూనే ప్లే ఆఫ్స్ చేరింది. ఆ తర్వాత సీజన్‌లోనూ ప్లే ఆఫ్స్‌తోనే సరిపెట్టుకున్న లక్నో పదిహేడ్ సీజన్‌లో మాత్రం నిరాశపరిచింది. దాంతో.. మెంటార్‌గా జహీర్ ఖాన్‌ను నియమించుకుంది లక్నో. అనుభవజ్ఞుడైన ఈ దిగ్గజ పేసర్ రాకతోనైనా తమ జట్టు తొలి ఐపీఎల్ టైటిల్ పట్టేస్తుందని ఫ్రాంచైజీ భావించింది. కానీ, జహీర్ పెద్దగా ప్రభావం చూపలేకపోయాడు. పద్దెనిమిదో సీజన్‌లో లక్నో పేస్ దళం వైఫల్యం కారణగా ప్రత్యర్థికి భారీ స్కోర్లు సమర్పించుకోవడంతో యజమాని సంజీవ్ గొయెంకా జహీర్‌పై తీవ్ర అసంతృప్తిగా ఉన్నాడు.

అయితే.. కెప్టెన్ రిషభ్ పంత్‌తో జహీర్‌కు అతడికి మంచి అనుబంధమే ఉండేది. కానీ.. కోచ్ లాంగర్, గొయెంకా తీరుతోనే అతడు విసిగిపోయాడు. 14 మ్యాచుల్లో కేవలం ఆరు విజయాలకే పరిమితమైన లక్నో ఏడో స్థానంలో నిలవడంతో జహీర్‌ను తప్పించాలని మేనేజ్‌మెంట్ అనుకుంది. ఈ వెటరన్ పేసర్ నిష్క్రమణతో ఎల్ఎస్‌జీ కొత్త మెంటర్ వేటను ప్రారంభించనుంది. విదేశీ లీగ్స్‌లోని తమ సిస్టర్ ఫ్రాంచైజీ బాధ్యతలు కూడా చూసుకోగల.. సమర్థుడైన వ్యక్తి కోసం లక్నో వెతుకుతోంది.

### గంభీర్ మొండి పట్టుతో

భారత జట్టు పేసర్లలో అగ్రగణ్యుడైన జహీర్ ఖాన్ 2011 వరల్డ్ కప్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. అనంతరం ఐపీఎల్లో ముంబై ఇండియన్స్‌కు బౌలింగ్ కోచ్‌గా సేవలందించాడు. ఐపీఎల్‌లో సుదీర్ఘ అనుభవం ఉన్న జహీర్ టీమిండియా బౌలింగ్ కోచ్‌గా ఎంపికవుతాడనే వార్తలు వినిపించాయి. అయితే.. కోచ్ గంభీర్ మాత్రం మొండి పట్టుతో మోర్కెల్‌ను తన టీమ్‌లో చేర్చుకున్నాడు.

# మాపై ఎలాంటి ఒత్తిడి లేదు..

**వివాదం అంశాన్ని పీసీబీ చూసుకుంటుంది: పాక్ పేసర్ రవూఫ్**

**'షేక్ హ్యాండ్' వివాదంలో పాకిస్థాన్‌కు క్షమాపణ చెప్పిన మ్యాచ్ రిఫరీ**

**గంట ఆలస్యంగా ప్రారంభమైన పాకిస్థాన్-యూఏఈ మ్యాచ్**

**వివాదం మమ్మల్ని ప్రభావితం చేయలేదన్న రవూఫ్**



**ఇస్లామాబాద్:** ఆసియా కప్ 2025లో భారత్, పాకిస్థాన్ మ్యాచ్ సందర్భంగా మొదలైన 'షేక్ హ్యాండ్' వివాదం కీలక మలుపు తిరిగింది. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) చేసిన ఆరోపణల నేపథ్యంలో మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్, పాక్ జట్టు యాజమాన్యానికి, కెప్టెన్‌కు క్షమాపణలు చెప్పినట్లు పీసీబీ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ వివాదం కారణంగా యూఏఈతో పాకిస్థాన్ మ్యాచ్ గంట ఆలస్యంగా ప్రారంభమైంది.

భారత్‌తో మ్యాచ్‌కు ముందు టాస్ సమయంలో, తమ కెప్టెన్ సల్మాన్ అలీ అఘాను భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌తో షేక్ హ్యాండ్ ఇవ్వవద్దని రిఫరీ పైక్రాఫ్ట్ సూచించారని పీసీబీ ఆరోపించింది. దీనిపై అంతర్జాతీయ క్రికెట్ మండలికి (ఐసీసీ) ఫిర్యాదు చేసినా, రిఫరీని మార్చాలన్న విజ్ఞప్తిని ఐసీసీ తిరస్కరించింది. ఈ నేపథ్యంలో, యూఏఈతో మ్యాచ్‌కు ముందు పీసీబీ ఛైర్మన్ మోహ్సిన్ నఖ్వీ... మాజీ ఛైర్మన్లు రమీజ్ రాజా, నజమ్ సేథీలతో చర్చలు జరిపారు. ఈ చర్చల కారణంగా పాకిస్థాన్ జట్టు హోటల్ నుంచి మైదానానికి ఆలస్యంగా బయలుదేరింది. దీంతో మ్యాచ్ మధ్యాహ్నం 3:30 గంటలకు బదులుగా 4:30 గంటలకు మొదలైంది.

ఈ నాటకీయ పరిణామాల మధ్య జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్ 41 పరుగుల తేడాతో యూఏఈపై విజయం సాధించి సూపర్-4 దశకు అర్హత సాధించింది. మ్యాచ్ అనంతరం పాక్ పేసర్ హారీస్ రవూఫ్ మాట్లాడుతూ.. "మైదానం బయట జరిగిన వివాదంతో మాకు ఎలాంటి ఒత్తిడి లేదు. అది బోర్డు చూసుకుంటుంది. మా దృష్టి అంతా మ్యాచ్‌పైనే ఉంది" అని స్పష్టం చేశాడు. జట్టు యాజమాన్యమే ఈ విషయాలను చూసుకోవడంతో తాము ఆటపైనే దృష్టి పెట్టగలిగామని ఆయన తెలిపారు.

# హ్యాండ్‌షేక్ వివాదం... రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్‌కు అండగా నిలిచిన ఐసీసీ

**ఆసియా కప్‌లో హ్యాండ్‌షేక్ వివాదం**

**రిఫరీ క్షమాపణ.. మెత్తబడ్డ పాకిస్థాన్**

**మ్యాచ్ అధికారుల నియామకం తమ విచక్షణాధికారమన్న ఐసీసీ**






**న్యూఢిల్లీ:** ఆసియా కప్ 2025లో చోటుచేసుకున్న తీవ్ర వివాదం చివరికి సద్దుమణిగింది. భారత్‌తో మ్యాచ్ సందర్భంగా జరిగిన పరిణామాలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ, టోర్నమెంట్‌ను బహిష్కరిస్తామని హెచ్చరించిన పాకిస్థాన్... మ్యాచ్ రిఫరీ క్షమాపణ చెప్పడంతో వెనక్కి తగ్గింది. దీంతో టోర్నీలో నెలకొన్న తీవ్ర ఉత్కంఠకు తెరపడింది.

భారత్-పాకిస్థాన్ మ్యాచ్ సందర్భంగా కెప్టెన్ల మధ్య హ్యాండ్‌షేక్ జరగకపోవడం వివాదానికి దారితీసింది. దీనికి మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్ వైఖరే కారణమని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) తీవ్ర ఆరోపణలు చేసింది. రిఫరీని మార్చాలంటూ ఐసీసీపై ఒత్తిడి తెచ్చింది. యూఏఈతో జరగాల్సిన తమ తర్వాతి మ్యాచ్‌ను బహిష్కరిస్తామని హెచ్చరించింది. ఈ పరిణామాలతో టోర్నీ భవితవ్యంపై నీలినీడలు కమ్ముకున్నాయి.

అయితే, మ్యాచ్‌కు కొన్ని గంటల ముందు ఆండీ పైక్రాఫ్ట్.. పాకిస్థాన్ కెప్టెన్ సల్మాన్ అలీ అఘా, టీమ్ మేనేజర్‌తో సమావేశమయ్యారు. టాస్ సందర్భంగా తన వైపు నుంచి "కమ్యూనికేషన్ గ్యాప్" జరిగిందని అంగీకరించి, వారికి క్షమాపణ తెలిపారు. ఈ విషయాన్ని పీసీబీ ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీ ధ్రువీకరించారు. "భారత్‌తో మ్యాచ్ నుంచి ఈ సంక్షోభం నడుస్తోంది. రిఫరీ ప్రవర్తనపై మాకున్న అభ్యంతరాలు, ఆయన క్షమాపణ చెప్పడంతో పరిష్కారమయ్యాయి" అని ఆయన వివరించారు. మరోవైపు, అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మాత్రం మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్‌కు గట్టిగా మద్దతుగా నిలిచింది. ఆయన ఏ నిబంధననూ ఉల్లంఘించలేదని స్పష్టం చేసింది. రిఫరీని మార్చాలన్న పీసీబీ డిమాండ్‌ను నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. పైక్రాఫ్ట్ చెప్పిన క్షమాపణ కేవలం భావప్రసార లోపానికి మాత్రమే పరిమితమని, హ్యాండ్‌షేక్ ఘటనకు కాదని ఐసీసీ వర్గాలు పేర్కొన్నాయి. మ్యాచ్ అధికారుల నియామకం తమ విచక్షణాధికారమని, సభ్య దేశాలు ఇందులో జోక్యం చేసుకోలేవని ఐసీసీ స్పష్టం చేసింది.




## ఓజీ నుంచి ప్రకాశ్‌రాజ్

# పోస్టర్ విడుదల

**టాకీస్:** పవన్ కల్యాణ్ హీరోగా 'ఓజీ' సెప్టెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా మేకర్స్ ఓ సర్‌ప్రైజ్ ఇచ్చారు. ఇందులో విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్ పాత్రను పరిచయం చేస్తూ ఓ పోస్టర్‌ను విడుదల చేశారు. చిత్రంలో ఆయన 'సత్య దాదా' అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. తాజాగా విడుదల చేసిన పోస్టర్‌లో ప్రకాశ్ రాజ్ సీరియస్ లుక్‌లో కనిపించారు. పోస్టర్ ఆధారంగా ఆయన పాత్ర కీలకమని అర్థమవుతోంది. సుజీత్ దర్శకత్వంలో గ్యాంగ్‌స్టర్ యాక్షన్ థ్రిల్లర్‌గా 'ఓజీ' రూపొందుతోంది. ఇందులో పవన్ ఇప్పటి వరకూ ఎన్నడూ చూడని పాత్రలో ఓజాస్ గంభీర అనే గ్యాంగ్‌స్టర్‌గా కనిపించనున్నారు. ఆయన సరసన ప్రియాంకా మోహన్ నటించారు. శ్రియారెడ్డి, అర్జున్‌దాస్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ప్రస్తుతం దీని పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

## కల్కి-2 నుంచి తప్పకున్న దీపిక

టాకీస్: ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కల్కి 2898 ఏడీ' పార్ట్-2 నుంచి దీపక తప్పకున్నారు. గతేడాది విడుదలైన ఈ చిత్రం భారతీయ సినిమాకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చి ఎన్నో అవార్డులను సొంతం చేసుకుంది. దీనికి సీక్వెల్ ఉన్నట్లు- ఇప్పటికే చిత్రబృందం వెల్లడించిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ మూవీ టీమ్ సడెన్ షాక్ ఇచ్చింది. దీని సీక్వెల్‌లో దీపికా పదుకొణె నటించడం లేదని స్పష్టం చేసింది. ఈ విషయాన్ని తెలుపుతూ నిర్మాణ సంస్థ పోస్ట్ పెట్టింది. 'కల్కి' సీక్వెల్‌లో దీపిక భాగం కాదని అధికారికంగా తెలియజేస్తున్నాం. తొలి భాగం కోసం ఆమెతో సుదీర్ఘ ప్రయాణం చేసినప్పటికీ రెండో పార్ట్‌లో భాగస్వామి కాలేకపోయింది. గొప్ప టీమ్‌తో కల్కి సీక్వెల్ మీ ముందుకు వస్తుంది. భవిష్యత్తులో దీపిక మంచి సినిమాలతో అలరించాలని కోరుకుంటున్నాం అని వైజయంతీ మూవీస్ పోస్ట్ పెట్టింది. నిర్మాణ సంస్థ ప్రకటనతో అభిమానులు షాక్ అవుతున్నారు. గత కొన్ని రోజులుగా దీపికా పేరు నిత్యం సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్న విషయం తెలిసిందే. ఇటీ-వల ఆమె ఓ భారీ ప్రాజెక్ట్ నుంచి వైదొలగినట్లు- కూడా వార్తలు వచ్చాయి. ఇప్పుడు ఈ భారీ అప్‌కమింగ్ సినిమా నుంచి ఆమె వైదొలగడం చర్చనీయాంశంగా మారింది.






# గ్లామర్ గేట్లు ఎత్తేసిన తెలుగమ్మాయి

## రీతూ వర్మ అదరగొట్టేసిందిగా..

టాకీస్: టాలీవుడ్ ఇండస్ట్రీలో అందం, అభినయంతో ఆడియన్స్ హృదయాలు గెలుచుకున్న హీరోయిన్లలో రీతూ వర్మ ఒకరు. ఈముద్దుగుమ్మ అచ్చతెలుగమ్మాయి.. అద్భుతమైన నటనతో ప్రేక్షకులను కట్టిపడేసింది ఈ చిన్నది. ఆమె నటించిన సినిమాలన్నీ మంచి విజయాలను అందుకున్నాయి. మొన్నామధ్య మజాకా సినిమాతో మరో విజయాన్ని అందుకున్న ఈ ముద్దుగుమ్మకు తెలుగులో అంతగా ఆఫర్స్ రావడం లేదు. మొన్నామధ్య మజాకా సినిమాతో మరో విజయాన్ని అందుకున్న ఈ ముద్దుగుమ్మకు తెలుగులో అంతగా ఆఫర్స్ రావడం లేదు. మజాకా సినిమా తర్వాత సైలెంట్ అయ్యింది ఈ అమ్మడు. ఆ మధ్య ఓ వెబ్ సిరీస్ చేసింది. కానీ అంతగా ఆకట్టుకోలేదు. తాజాగా నెట్టింట షేర్ చేసిన ఫోటోస్ తెగ వైరలవుతున్నాయి. యాక్షన్, కామెడీ సినిమాలు చేస్తూ అలరించిన ఈ ముద్దు గుమ్మకు ఇప్పటివరకు అగ్ర హీరోల సరసన ఛాన్స్ రాలేదు. ప్రస్తుతం తెలుగులో ఓ మల్టీస్టారర్ చిత్రంలో నటిస్తుంది. వరుస సినిమాలతో సక్సెస్ అందుకుంటు న్న ఈ బ్యూటీకి.. ఇప్పటివరకు కమర్షియల్ హీరోయిన్ గా గుర్తింపు మాత్రం రాలేదు. చిన్న, మీడియం రేంజ్ హీరోలతోనే సినిమాలు చేస్తుంది. ఇప్పటికే నటిగా తనను తాను ప్రూవ్ చేసుకుంది రీతూ వర్మ. కానీ కమర్షియల్ హీరోయిన్ గా మాత్రం సక్సెస్ కాలేదు. ప్రస్తుతం ఈ అమ్మడు సరైన బ్రేక్ కోసం ఎదురు చూస్తుంది. సోషల్ మీడియాలో వరుస ఫోటోషూట్స్ చేస్తుంది. రీసెంట్ గా గ్లామర్ డోస్ పెంచి సోషల్ మీడియాను షేక్ చేస్తుంది. ఓ రేంజ్ లో అందాలు ఆరబోస్తూ కుర్రాళ్లను కవ్విస్తుంది రీతూ.. తాజాగా కొన్ని ఫోటోలు వదిలింది ఈ ముద్దుగుమ్మ.

## కిస్ మూవీ ట్రైలర్ విడుదల

**టాకీస్:** తమిళ నటుడు కవిన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'కిస్'. 'దాదా' సినిమాతో మంచి హిట్ అందుకున్న కవిన్.. ఈ రొమాంటిక్ కామెడీ చిత్రంలో నటిస్తుండటంతో సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. ప్రముఖ కొరియోగ్రాఫర్ సతీష్ కృష్ణన్ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతుండగా.. రోమియో పిక్చర్స్ బ్యానర్‌పై రాహుల్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం సెప్టెంబర్ 19న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా, సినిమా



నుంచి తాజాగా తెలుగు ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఇందులో కవిన్.. ప్రేమ, ముద్దు అంటే అస్సలు ఇష్టపడని యువకుడి పాత్రలో కనిపిస్తున్నారు.

గతంలో జరిగిన సంఘటనల కారణంగా ప్రేమపై నెగిటివ్ భావాలు ఏర్పడిన అతడి జీవితంలోకి 'ప్రీతి' అనే అమ్మాయి ప్రవేశించిన తర్వాత ఎలాంటి మార్పులు జరిగాయి? అన్నదే ఈ సినిమా ప్రధాన కథాంశం.ఈ చిత్రం తెలుగు, తమిళంతో పాటు- హిందీ భాషల్లో కూడా విడుదల కానుంది.



## కుటుంబ గొడవలతో మౌనంగా ఉన్నా

### దక్ష ప్రమోషన్‌లో వెల్లడించిన మంచు లక్ష్మి

టాకీస్: ఇంట్లో ఎవరు హిట్ అందుకున్నా.. అది అందరి విజయంగా భావించి ఆనందిస్తానని నటి మంచు లక్ష్మి అన్నారు. తన తండ్రి మోహన్‌బాబుతో కలిసి ఆమె నటించిన యాక్షన్ చిత్రం 'దక్ష' 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్ర ప్రచారంలో ఆమె బిజీగా ఉన్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తమ కుటుంబంలో జరిగిన గొడవలపై మాట్లాడారు. మిరాయ్' విజయాన్ని నేను కూడా ఎంజాయ్ చేస్తున్నాను. కుటుంబంలో ఎవరికి సక్సెస్ వచ్చినా మా అందరిదిగా భావించి ఆనందిస్తా. ఒకరి కష్టం వృథా కావాలని ఎప్పుడూ కోరుకోను. జీవిత పాఠాలు నేర్చుకోవాలి అనుకుంటాను.. కానీ, కష్టానికి ప్రతిఫలం రాకుండా ఉండాలని ఎప్పుడూ కోరుకోను. ఎందుకంటే ఈ రంగంలో ఎన్ని ఇబ్బందులు ఉంటాయో నాకు తెలుసు. ఒక ఆర్టిస్ట్‌గా వాళ్లకు సలహాలు ఇస్తాను. 'మిరాయ్' సక్సెస్‌ను ఎంజాయ్ చేయమని మొన్న కలిసినప్పుడు కూడా మనోజ్‌కు చెప్పానని అన్నారు. ఒక కుటుంబంలో ఏదైనా సమస్య వచ్చినప్పుడు అందరూ నలిగిపోతారు. అలా జరగదు అని చెప్పడం అబద్ధం. కానీ, మేము ఉండేది అద్దాల మేడలో.. ఏం చెప్పినా తల, తోక కట్ చేసి వాళ్లకు నచ్చినట్లు- రాసుకునే రోజులివి. అలాంటప్పుడు సైలెంట్‌గా ఉండడమే ఉత్తమం అని నాకు అనిపించింది. అందుకే మౌనంగా ఉన్నాను. గతంలో ఏది ఒప్పు, ఏది తప్పు అని ఆలోచించేదాన్ని. ఇప్పుడు అలా ఆలోచించడం లేదు. దీని వల్ల నేను ఆనందంగా ఉంటానా, బాధపడతానా అని ఆలోచిస్తున్నాను. జీవితంలో ఏదైనా మనకు ఒక పాఠం నేర్పడానికే వస్తుంది. ఏది జరిగినా మౌనంగా ఆలోచిస్తే ప్రశాంతత లభిస్తుందని మంచు లక్ష్మి చెప్పారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.